ప్రజాశక్తి

సోమవారం 18 ఆగస్టు 2025 | 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

వానొస్తే కష్టమే..!

- విజయవాడలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- డ్రెయిన్ల మరమ్మతులు ప్రశ్నార్థకం
- నిధుల్లేక ఆగిపోయిన స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ

ప్రజాశక్తి-విజయవాడ: డ్రైనేజి వ్యవస్థ అధ్వానంగా తయారు కావడంతో విజయవాడ నగర వాసులకు తిప్పలు తప్పడం లేదు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు విజయవాడ నగరం తటాకంగా తయారై మోకాళ్ల నీటిలో తేలాడుతుంది. డ్రైన్లు దెబ్బతినడం, అర్ధాంతరంగా నిలిపివేసిన స్ట్రామ్ వాటర్ డ్రైయినేజి వ్యవస్థను ప్రభుత్వాలు ఏళ్ల తరబడి పూర్తి చేయకపోవడంతో విజయవాడ పరిస్థితి దయనీయంగా తయారైంది. నగర పరిధిలోని ఔట్‌ఫాల్ డ్రైన్లు, మేజర్, మీడియం డ్రైన్లలో పూర్తిస్థాయిలో వేసవిలో సిల్టు, ఇతర వ్యర్థాలను తొలగించకపోవడంతో వర్షాలు పడిన సందర్భంలో సక్రమంగా పారుదల లేక, డ్రైనేజీ నీరు, వర్షపునీరు కలిసిపోయి రోడ్లు, వీధులు, డ్రైన్లు మొత్తం ఏకమై తటాకాలుగా నగరం తయారవుతుంది. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు ఏ వీధి చూసినా, ఏ రోడ్డు చూసినా, ఏ డ్రైన్ చూసినా మోకాళ్ల లోతు నీరు నిలబడే ఉంది.

విజయవాడ నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో 1200 కిలోమీటర్ల పొడవున డ్రైన్లు ఉన్నాయి. వీటిల్లో సుమారు 80 కిలోమీటర్ల పొడవున అవుట్‌ఫాల్ (మేజర్ డ్రైయిన్లు) ఉన్నాయి. అయితే దశాబ్దాల క్రితం నిర్మితమైన ఈ డ్రైనేజీ వ్యవస్థ మొత్తం దెబ్బతింది. అంతేగాక అండర్ గ్రౌండ్ డ్రైనేజి (యుజిడి) వ్యవస్థ ధ్వంసం కాగా ఇంకా పూర్తి చేయాల్సిన ఏరియాల్లో నిధుల సమస్యతో పనులు ఏళ్ల తరబడి ప్రారంభించడం లేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి 2016లో అప్పటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖా మంత్రిగా ఎం.వెంకయ్యనాయుడు ఉన్న కాలంలో విజయవాడ నగరానికి స్ట్రామ్ వాటర్ డ్రైనేజి స్కీమ్ కింద (వర్షపు నీటి కాలువల) రూ.461 కోట్లు మంజూరు చేయగా, 2017 నుంచి 2019 మధ్య వరకు అప్పటి టిడిపి ప్రభుత్వం కాలంలో 50 శాతం లోపు మాత్రమే ఈ డ్రైన్ల నిర్మాణం పూర్తయ్యింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ స్కీమ్‌ను పూర్తిగా విస్మరించి పక్కన పడేసింది. ఈ డ్రైన్ల నిర్మాణం చేపట్టిన ఎల్అండ్‌టి కంపెనీ పెండింగ్ నిధులు మంజూరు చేయకపోగా కనీసంగా కంపెనీకి సంబంధించిన పద్దు కూడా లేకుండా వైసిపి ప్రభుత్వం చేయడంతో విసిగివేశారి సదరు కంపెనీ యాజమాన్యం (మిగతా 2లో)

వర్షాలతో అప్రమత్తం

- బ్యారేజీకి పెరిగిన వరద
- కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో ముందస్తు చర్యలు

ప్రజాశక్తి-విజయవాడ, కలెక్టరేట్ (కృష్ణా)

విజయవాడ ప్రకాశం బ్యారేజీకి మరోసారి వరద ప్రవాహం పెరిగింది. ఎన్టీఆర్ జిల్లాలోని కట్టలేరు, మున్నేరు వాగుల నుంచి వరద ఉధృతి ఎక్కువ కావడంతో సోమవారం ఉదయానికి నాలుగు లక్షల క్యూసెక్కులు చేరుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద 3.97 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం దాటితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. ఆదివారం సాయంత్రానికి ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో 2,85,392 లక్షల క్యూసెక్కులు కొనసాగుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు ప్రకటించారు. కృష్ణా నదికి పెరుగుతున్న వరద ఉధృతి పట్ల కృష్ణాజిల్లాలోని నదీ పరివాహక ప్రాంతాల్లో అవసరమైన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కృష్ణాజిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా అధికారులు, క్షేత్రాధికారులతో వరద పరిస్థితులపై ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 20వ తేదీ నాటికి

రామలింగేశ్వరనగర్‌లో పర్యటిస్తున్న కమిషనర్

వరద ప్రవాహం ఏడు లక్షల క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జల వనరులు, రెవెన్యూ, పోలీసు, రవాణా, మత్స్యశాఖ, పంచాయతీ రాజ్, రహదారులు భవనాలు, వ్యవసాయ తదితర శాఖల అధికారులు వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. సచివాలయ సిబ్బంది ద్వారా వరద ప్రభావిత ప్రాంతాల్లోని గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఎక్కడైనా రహదారులు దెబ్బతిని రాకపోకలకు అంతరాయం కలిగితే తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సంబంధిత (మిగతా 2లో)

సమగ్రాభివృద్ధే ధ్యేయం

కృష్ణాజిల్లా కలెక్టర్ డికె బాలాజీ

ఇంటర్వ్యూ ...5లో

అధిక ధరలకు ఎరువుల విక్రయాలు

- లబోదిబోమంటున్న రైతులు
- చోద్యం చూస్తున్న వ్యవసాయ అధికారులు

వార్త 4లో

ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలి

సిపిఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి-ఉయ్యూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హిందూ మతోన్మాద రాజకీయాలకు వేదికలుగా మారాయని, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని, దీనిని ఎదుర్కొనేందుకు ప్రజా పోరాటాలు ఉధృతం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు పిలుపునిచ్చారు. ఉయ్యూరులో సిపిఎం కృష్ణాజిల్లా ప్లీనం సమావేశం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్ళం వెంకటేశ్వరరావు అధ్యక్షత జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ సభలో మోడీ మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని దేశ ప్రజలపై రుద్దాలని

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, వేదికపై వై.వెంకటేశ్వరరావు

చూశారన్నారు. బిజెపి పాలనలో మాత్రమే దేశం అభివృద్ధి చెందిందని అభివర్ణించటం సరికాదన్నారు. దేశ సమైక్యతను, సమగ్రతను గాలికి వదిలేసి ఆర్‌ఎస్‌ఎస్ భజన చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలనలో తొలి అడుగు అంటూ ప్రచార ఆర్భాటం తప్ప సూపర్ సిక్స్ హామీలు అమల్లో విఫలమైందని అన్నారు. కార్పొరేట్ సంస్థల షరతులకు తలొగ్గి విద్యుత్తు స్మార్ట్ మీటర్లు బిగించడంలో ఎపి ముందుందని, ప్రజలపై పడుతున్న విద్యుత్ భారాలను వ్యతిరేకించాలని అన్నారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందంలో రాష్ట్ర (మిగతా 2లో)

మహిళలకు బస్సు కష్టాలు

శ్రీకాకుళం బస్‌స్టాప్‌లో బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ప్రజాశక్తి-ఘంటసాల: మహిళలకు ఉచిత బస్సు కష్టాలు మొదలయ్యాయి. ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం కరకట్టపై బస్సుల కోసం ఆదివారం ప్రయాణికులు గంటల కొద్దీ ఎదురుచూశారు. ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెట్టారుగానీ సరిపడా బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో అవనిగడ్డ నుంచి విజయవాడ వెళ్లే కరకట్ట ఎక్స్‌ప్రెస్‌లు అవనిగడ్డ, మోపిదేవి, చల్లపల్లి స్టాప్‌లలో ప్రయాణికులతో నిండిపోయి కిక్కిరిసి వస్తున్నాయి. దీంతో శ్రీకాకుళం స్టాప్‌లో బస్సు ఆపకపోవడంతో ప్రయాణికులు గంటల కొద్దీ ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. చివరకు తర్వాత వచ్చిన బస్సుల్లో ఒకరిద్దరు ఎక్కుతూ ప్రయాణం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెరిగిన రద్దీకి తగ్గట్లుగా బస్సులు ఏర్పాటు చేయాలని, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరుతున్నారు.

'రంగ్ తరంగ్'కు విశేష స్పందన

- చిత్ర కళా పోటీల్లో అబ్బురపర్చిన చిన్నారులు

వార్త 8లో

చిత్ర కళా పోటీల్లో బహుమతులు గెలుచుకున్న చిన్నారులు

మొదటిపేజీ తరువాయి

వానొస్తే కష్టమే..!

మొత్తం స్కీమ్‌ను పక్కన పడేసి గత నాలుగేళ్ల క్రితం వెళ్లిపోయింది. అప్పటి నుంచి నేటి వరకు ఒక్క రూపాయి పని కూడా జరగలేదు. ఈ స్కీమ్‌కు మంజూరైన 461 కోట్లలో నేటికీ రూ.289 కోట్లు ప్రభుత్వం వద్దనే ఏళ్ల తరబడి నిలిచిపోయాయి. ప్రస్తుతం నగర ప్రజలు, ఆయా రాజకీయ పార్టీల నుంచి వస్తున్న ఒత్తిడి మేరకు చేసేది లేక కూటమి ప్రభుత్వంలోని మునిసిపల్ శాఖా మంత్రి నారాయణ ఇటీవల సిఆర్‌డిఎ, విజయవాడ నగరపాలక సంస్థ, ఇతర శాఖల అధికారులతో సంయుక్త సమావేశం నిర్వహించి, విజయవాడ స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ స్కీమ్‌ను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించాలని సిఆర్‌డిఎ అధికారులను మంత్రి నారాయణ ఆదేశించడం, దానిపై సిఆర్‌డిఎ అంగీకరించడం జరిగిందే తప్ప నెలలు గడుస్తున్నా నేటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రభుత్వాల అలసత్వం, బాధ్యతారాహిత్యం కారణంగా వర్షాలు వచ్చిన ప్రతి సారి నగర ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నగరం మొత్తాన్ని వర్షపునీరు ముంచెత్తుతుంది. నగరంలోని ప్రధానంగా పిన్నమనేని పాలీక్లీనిక్ రోడ్డు, నిర్మలా కాన్వెంట్ రోడ్డు, గుణదల సెయింట్ జోన్స్ స్కూల్, ఇఎస్‌ఐ రోడ్డు, దేవి నగర్, మధ్య కట్ట, బుడమేరు మధ్య కట్ట, విజయదుర్గానగర్, తమ్మిన దుర్గారావునగర్, లెనిన్ నగర్, కండ్రిక, వాంబేకాలనీ, ప్రకాష్‌నగర్, వన్‌టౌన్ సితార సెంటర్, భవానీపురం, లేబర్ కాలనీ, కబేళా తదితర ప్రాంతాలన్నీ వర్షపునీటిలో మునిగిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కండ్రిక, 62వ డివిజన్ పటేల్‌నగర్, 64వ డివిజన్ సుబ్బారెడ్డి మునిసిపల్ స్కూల్ ఎదురు ఇళ్లల్లోకి నీరు చేరి, నివాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా విఎంసి పాలకవర్గం, అధికారులు, ప్రజాప్రతినిధులు మిన్నకుండిపోయారు. నీటిని తోడించడం, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలనే ధ్యాస కొరవడటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇప్పటికైనా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి, వర్షపునీటి ఇబ్బందుల నుంచి బయటపడేయాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షాలతో అప్రమత్తం

అధికారులకు సూచించారు. ప్రమాదకర కొండ ప్రాంతాలు, వరద ముంపు ప్రాంతాల్లో నివశిస్తున్న ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర కోరారు. శాఖాధిపతులు, స్పెషల్ ఆఫీసర్లతో ఆయన టెలికాన్ఫెరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాల కారణంగా కొండ చర్యలు విరిగిపడి ప్రమాదం ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అందరూ పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లే విధంగా అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా రామలింగేశ్వర నగర్ సాయిరాం కట్ పీసెస్ వీధి చివర రిటైనింగ్ వాల్ వద్ద ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించారు. ఫ్లడ్ రెస్పాన్స్ టీం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రానున్న రెండు మూడు రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో గల వరద ముంపు ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యలుగా ఫ్లడ్ రెస్పాన్స్ టీంలను మూడు షిఫ్టుల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలి

ప్రభుత్వం సర్దుబాటు ఛార్జీల పేరుతో పేద, మధ్యతరగతి ప్రజలపై పెను భారాలు మోపుతున్నారని, ప్రజలకు విద్యుత్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లపై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు యూరియా సరఫరా కరువైందని, బహిరంగ మార్కెట్లో అదనంగా డబ్బులు చెల్లించాల్సి వస్తుందని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని చర్యలు తీసుకోవాలని అన్నారు. స్థానిక సమస్యలపై ప్రజాసంఘాలను కలుపుకుని పోరాడాలని పిలుపునిచ్చారు. తొలుత సీనియర్ నాయకులు కొడాలి శర్మ సిపిఎం జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, కే.శివనాగేంద్రం, డి.లక్ష్మణస్వామి, పి.ధనశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మహిళా ఉద్యోగి విధులు

ఫైల్స్, బిల్లులపై ఇష్టానుసారంగా సంతకాలు

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ నగరపాలక సంస్థ సర్కిల్-1లో నెలల తరబడి భారీ స్థాయిలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ (జెటిఒ) గత ఏప్రిల్‌లో రిటైర్డ్ అయ్యారు. ఈ పోస్టు ఇప్పటి వరకు భర్తీ చేయలేదు. ఈ పరిస్థితుల్లో గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ విధానం (కాంట్రాక్ట్ బేస్)పై 2017లో ఉద్యోగంలో చేరిన ఒక మహిళా ఉద్యోగి సర్వీసు రూల్‌కు విరుద్ధంగా విధులు నిర్వర్తిస్తోంది. ఏకంగా జెటిఒ పోస్టు స్థాయిలో అన్ని రకాల ఫైల్స్‌పై సంతకాలు చేస్తూ అన్ని వ్యవహారాలు చక్కబెట్టుకుంటూ వెళ్తుందని పలువురు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఈ నాలుగైదు మాసాల వ్యవధిలోనే కోట్లాది రూపాయల విలువ చేసే పనులకు సంబంధించి బిల్స్‌పై, ఎస్టిమేట్లపై సంతకాలు చేశారు. ఏదేని ఐదు లక్షల్లోపు ఒక వర్క్‌కు సంబంధించి ఎస్టిమేట్లు, బిల్స్‌పై ఇంజినీరింగ్ విభాగంలోని ఎఇ నుంచి డిఇ, ఆ తరువాత డ్రాయింగ్ బ్రాంచ్ (డిబి), ఇఇ స్థాయి అధికారి వరకు వరుస క్రమంలో సంతకాలు ఉంటాయి. డ్రాయింగ్ బ్రాంచ్ (డిబి), అలాగే టెక్నికల్ ఆఫీసర్ సంతకాలు కూడా ఈ ఉద్యోగి నిరాటంకంగా చేస్తున్నట్లు తెలిసింది. రోజుకు రూ.40 లక్షల నుంచి 50 లక్షల విలువ కలిగిన పనులకు సంబంధించిన ఫైల్స్, బిల్స్‌పై సంతకాలు చేసేస్తున్నట్లు సమాచారం. అయితే ఈ మహిళా ఉద్యోగి లాగానే సర్కిల్-3లో కూడా మరొక ఉద్యోగి ఉన్నప్పటికీ ఆయన జెటిఒ స్థాయి విధులు కాకుండా, తనకు అప్పగించిన విధులు చేస్తున్నట్లు తెలిసింది. వీరిద్దరూ వారి ఉద్యోగాన్ని ప్రతి ఏడాది కౌన్సిల్ ఆమోదం ద్వారా రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుందని స్థానిక ఉద్యోగులు గుర్తు చేస్తున్నారు. అయితే టెక్నికల్‌కు సంబంధించి జెటిఒ పోస్టుకు తత్సమాన అర్హత కల్గిన వారు ఉన్నప్పటికీ వారికి అవకాశం ఇవ్వకుండా సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని తోటి ఉద్యోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మహిళా ఉద్యోగికి అధికారికంగా శాఖపరమైన జెటిఒ పోస్టు ఇవ్వకపోయినా కార్యాలయంలో ఈమెకున్న పలుకుబడిని ఉపయోగించుకుని ఈ పోస్టును మెయిన్‌టైన్ చేస్తున్నట్లు సమాచారం. తమ ఈ ఇరవై ఏళ్ల అనుభవంలో ఇటువంటి పరిస్థితి ఈ కార్యాలయంలో ఎన్నడూ చూడలేదని, ఎటువంటి అర్హత లేని మహిళా ఉద్యోగి ఏకంగా అన్ని రకాలుగా సంతకాలు చేస్తూ పలు వ్యవహారాలను చక్కబెట్టుకుంటూ పోతుంటే తామూ చూస్తూ ఊరుకోక తప్పడం లేదని పలువురు సీనియర్ కాంట్రాక్టర్లు చెబుతున్నారు. సర్కిల్-1లోని ఇఇ స్థాయి అధికారి దగ్గర నుంచి ఎస్ఇలు, చీఫ్ ఇంజినీర్లు ఇటువంటి వ్యవహారాలను పట్టించుకోరా అంటూ కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు.

విచారిస్తాం : శ్రీనివాస్, సర్కిల్-1 ఇఇ

సర్కిల్-1లో ప్రస్తుతం జెటిఒగా విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగి బిటెక్ సివిల్ అర్హత కలిగి ఉన్నప్పటికీ శాఖా పరంగా ఆమెకు అధికారికంగా ఆ పోస్టు కేటాయించారో లేదో తెలియదు. నేను ఇఇగా ఈ మధ్యనే విధుల్లో చేరా. పూర్తి స్థాయిలో విచారించిన అనంతరం ఆమెను ఆ పోస్టులో ఉంచాలా లేదా అనేది శాఖపరంగా నిర్ణయం తీసుకుంటాం.

బుడమేరులో గుర్రపుడెక్క తొలగింపు

ప్రజాశక్తి-విజయవాడ: బుడమేరు ప్రవాహంలో ఎటువంటి అడ్డంకులు లేకుండా విజయవాడ నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు రామవరప్పాడు పరిధిలోని ఎస్ఎల్‌వి గ్రాండ్ వద్ద పేరుకుపోయిన గుర్రపు డెక్క, వ్యర్థాలను ఆదివారము తొలగించారు. విజయవాడ నగర పరిధిలో బుడమేరు ప్రవాహంలో ఎటువంటి అంతరాయం లేకపోయినప్పటికీ నగర పరిధి కాని ప్రాంతాలలో అంతరాయం ఉన్నందున, విజయవాడలో బుడమేరు నీరు నిలిచిపోయే అవకాశం ఉన్నందున నగర పరిధి కాని ప్రాంతాలలో వ్యర్థాలను తొలగించే చర్యలు తీసుకుంటున్న చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, పర్యవేక్షణ ఇంజనీర్లు పి.సత్యనారాయణ, పి. సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ ఇంజనీర్స్ సింధూరను కమిషనర్ ధ్యానచంద్ర అభినందించారు. అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉంటూ కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు.

సిఐటియు జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్మికులు ఆదివారం సిఐటియు జండాను ఆవిష్కరించారు. ఇబ్రహీంపట్నం వర్కర్ యూనియన్ ప్రెసిడెంట్ వేముల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపాలిటీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రెసిడెంట్ జి సురేష్ ,సెక్రటరీ టి కష్ణ ,ఉపాధ్యక్షులు ఎస్ శ్రీను,కమిటీ సభ్యులు ఓ.లక్ష్మణరావు, లోవరాజు ,కష్ణయ్య, సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి యం మహేష్ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం

దళితవాడలో ఆదివారం డ్రైనేజీ పూడికతీత పనులు ప్రారంభించారు. హెల్త్ సెంటర్ సమీపంలో డ్రైనేజీ పూడుకుపోయి డొంక అంతా మురుగునీరు పట్టి రాకపోకలకు ఆటంకం ఏర్పడడంతో వసంత యువసేన నాయకులు సమస్యను పంచాయతీ సెక్రెటరీ రామారావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన పంచాయతీ కార్మికులను పంపించి డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టారు. దళితవాడలో రోడ్లన్నీ సిసి రోడ్లుగా మార్చాలని గత గ్రామసభలో తీర్మానం చేయడం చేశారు. దానిలో భాగంగానే పది రోడ్లు సిసి రోడ్లుగా మారాయని, ఇంకా సుమారుగా 10 రోడ్ల వరకు సిసి రోడ్లు పోయాల్సి ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వసంత యువసేన నాయకులు మాతంగి రామారావు, చాట్ల బాబురావు, పల్లిపాం రమేష్ , పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ముసురుతో పెసర రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-కంచికచర్ల

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వారం రోజులగా ముసురు పట్టి వర్షాలు కురుస్తుండటంతో కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో పెసర రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు మండలాల్లో సుమారు 3500 ఎకరాల్లో తొలకరి పంటగా పెసర సాగు చేశారు. పంట కోత దశకు వచ్చింది. నెల రోజులు క్రితం కురిసిన వర్షానికి పంటకు తెగుళ్ళు సోకాయి. దీని బారి నుండి పంటను కాపాడుకోవటానికి రైతులు నానా అవస్తలు పడ్డారు. ప్రస్తుతం పెసర పంట కోతకు వచ్చింది. చీడ పీడల వల్ల ఎకరాకు సగటున రెండు బస్తాలకు మించి దిగుబడి రాదని రైతులు అంటున్నారు. పెసర పంట కోతకు వచ్చిన సమయంలో ముసురు పెట్టటం వల్ల గింజలు మొలకెత్తే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్కడక్కడా కొద్దిగా పచ్చికాయలు ఉన్నాయి. గడచిన వారం ముసురు లేకుండా ఎండి కాశి నట్లయితే పంట పూర్తిగా ఆశాజనకంగా ఉండేదని రైతులు అంటున్నారు. ముసురు

పెట్టటం వల్ల వచ్చిన కొద్దిపాటి పంటను చేజిక్కించుకునేందుకు రైతులు యంత్రాల సహాయంతో హడావుడిగా పెసర పంటను కోరికేస్తున్నారు. పెసర కోతలు కోసమని కంచికచర్ల కు 50 కి పైగా యంత్రాలు వచ్చి సిద్దంగా ఉన్నాయి. ఆదివారం ఉదయం నుండి జల్లులు కురుస్తునే ఉంది.దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

సెలూన్ ప్రారంభం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

కొండపల్లి బైపాస్‌లో న్యూ బి కాలనీ సమీపంలో యాంబర్ అండ్ డ్యూ బ్యూటీ సెలూన్‌ను కొండపల్లి మునిసిపాలిటీ ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు ఆదివారం ప్రారంభించారు. జనసేన పార్టీ అధికార ప్రతినిధి, మైలవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ అక్కల రామ్మోహన్ రావు(గాంధీ) సంయుక్తంగా కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండపల్లిలో ఇటువంటి అత్యాధునిక సెలూన్‌ను ఏర్పాటు చేయడం ఆనందదాయకమని అన్నారు. సెలూన్ నిర్వాహకులు కనకదుర్గ, జ్యోతిర్మయిలను అభినందించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం, సంతోషం ఉండేందుకు ఇష్టపడుతున్నారు. యాంబర్ అండ్ డ్యూ బ్యూటీ సెలూన్ నిర్వాహకురాలు కనకదుర్గ మాట్లాడుతూ కొండపల్లి మునిసిపాలిటీలో ఎక్కడా లేనటువంటి సెలూన్ కొండపల్లి బైపాస్‌లో ప్రారంభించామని తెలిపారు. స్కిన్, హెయిర్ సొల్యూషన్స్ సంబంధించిన అన్ని రకాల ఫేషియల్స్, హెయిర్ సంభదించిన అన్ని రకాల ప్రొడక్ట్స్ తమ వద్ద ఉన్నాయన్నారు. మహిళలకు ప్రత్యేకంగా బ్యూటీ సెలూన్‌ను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని, కొండపల్లి మునిసిపాలిటీ ప్రజలు తమ సెలూన్‌కు విచ్చేసి తమ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

అంతా నా ఇష్టం

- సమయపాలన పాటించని వైద్యాధికారిణి
- రోగులకు అందని వైద్య సేవలు..
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- కొరవడిన ఉన్నతాధికారులు పర్యవేక్షణ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లా కలక్టర్,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రతిరోజూ విధులు నిర్వహించే చోటే ప్రజలకు వైద్య సేవలు అందని సంఘటనలు జిల్లా కేంద్రమైన మచిలీపట్నం చిలకలపూడి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో చోటు చేసుకున్నాయి. ఇక్కడ విధులు నిర్వహించాల్సిన వైద్యురాలు ఎప్పుడూ విధులకు హాజరు అవుతారు, ఎప్పుడూ గైర్హాజరు అవుతారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. అసలే వైద్యుల కొరత .. ఉన్న వైద్యులు సక్రమంగా విధులకు హాజరుకాకపోవడంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యం అందక ప్రైవేట్ ఆసు పత్రులను ఆశ్రయించి జేబులను గుల్ల చేసుకుంటున్నారు.

మచిలీపట్నం చిలకలపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యురాలు తరచూ విధులకు గైర్హాజరు అవుతున్నట్టు ఆసుపత్రికి వచ్చే పలువురు రోగులు తెలుపుతున్నారు. ఈ సెంటర్‌కు ప్రతి రోజూ సుమారు 50 నుండి వంద మంది రోగులు వైద్య సేవలు పొందేందుకు వస్తుంటారు. అయితే ఇక్కడ వైద్యురాలు మాత్రం విధులకు హాజరవడం కంటే గైర్హాజరు అవడమే ఎక్కువ ఉంటోందని రోగులు తెలుపుతున్నారు. దీనివల్ల అత్యవసర పరిస్థితుల్లో ఇక్కడకు చికిత్స నిమిత్తం వచ్చే వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వచ్చిన కొంతమంది రోగులు సరైన పరీక్షలు, చికిత్సలు పొందలేక నర్సులు ఇచ్చే కొద్దిపాటి మందులతోనే వెనుదిరగాల్సి వస్తోంది.

ప్రజా ప్రతినిధుల అండదండలతోనే విధులకు గైర్హాజరు ?..

వైద్యురాలి గైర్హాజరు వెనుక కూటమి ప్రభుత్వ పెద్దల అండదండలు, పుష్కలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆమె కుటుంబ రాజకీయ సంబంధాలే ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే అదునుగా ఇక్కడ పనిచేసే సిబ్బంది పై కూడా ఆమె దురుసుగా వ్యవహరిస్తారనే ఆరోపణలు లేక పోలేదు. ఈమె దురుసు ప్రవర్తనతో పలువురు ఉద్యోగాలు మానేసి వెళ్లిపోయారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సాక్షాత్తు మంత్రి ఇలాకాలో ప్రజలకు వైద్యం అందటం లేదంటే ఇలాంటి సంఘటలకు మంత్రి వత్తాసు పలుకుతారా? లేక ఆయన పేరు చెప్పుకుని ఇలా వ్యవహరిస్తున్నారా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

నర్సులే డాక్టర్లు ....

వైద్యురాలు గైర్హాజరు తో వచ్చే రోగులకు నర్సులు, తదుపరి క్యాడర్ ఉద్యోగులే పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చి పంపుతున్నట్టు పరిశీలనలో వెల్లడైంది. ఓపి సమయం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉన్నా, వైద్యురాలు గైర్హాజరుతో సిబ్బంది, అటెండెంట్లే క్లినిక్ నడపాల్సి వస్తోంది. జిల్లా కేంద్రంలో ఉన్న ఆసుపత్రిపైనే ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోతే ఇక గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

రెండుసార్లు వచ్చా.. డాక్టర్ లేరన్నారు

సిహెచ్ నాగమణి

వంట్లో నలతగా ఉందని ఆసుపత్రికి వచ్చి పరీక్షలు చేయించానని ఈ పరీక్షల్లో షుగర్, బిపి ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందని రోగి సిహెచ్. నాగమణి తెలిపింది. డాక్టర్ కు చూపించి మందులు తీసుకుందామని వెళితే డాక్టర్ రాలేదు అక్కడ ఉన్న నర్సులే మందు బిళ్ళలు పంపించారని తెలిపారు.

ఇలా అనేక మంది రోగులు వైద్యురాలు దగ్గర వైద్య సేవలు పొందకుండానే ఆసుపత్రి సిబ్బంది ఇచ్చిన మందు బిళ్ళలతోనే సరి పెట్టుకోవాల్సి వస్తుంది. కాబట్టి ఇప్పటికైనా స్తానిక మంత్రి స్పందించి ఈ వైద్యురాలకి ఏ రాజకీయ నాయాకులు అండగా నిలుస్తూ వైద్య సేవలు అందకుండా చేస్తున్నారో విచారణ నిర్వహించి వారిని కట్టడి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంత ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : మచిలీపట్నం ఈడేపల్లికు చెందిన గూడవల్లి లోకేష్ (29) ఆదివారం ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు గతంలో ఏపీఎస్ఆర్టీసీ లో కార్గో లో కాంట్రాక్ట్ ఉద్యోగం చేసేవాడు. ఆత్మ హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. వివాహ దినో త్సవం జరుపుకొని మరుసటి రోజు ఆత్మహత్యకు పాల్పడటంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మచిలీపట్నం చిలకలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత్స్యకారులకు ఉపకరణాలు అందజేయాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : రైతు భరోసా కేంద్రాల మాదిరిగా మత్స్య భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి మత్స్యకారులకు అవసరమైన వత్తి ఉపకరణాలు 75 శాతంపై సబ్సిడీపై అందజేయాలని ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లక్కనం నాగాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం అవనిగడ్డలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఫిష్ లాండింగ్ సెంటర్ ఆర్బర్లలో ఈ విధమైన కేంద్రాలను ఏర్పాటు చేసి ఆయా కేంద్రాలలో వలలు, ఐస్ బాక్సులతోపాటు అవసరమైన వేట సామాగ్రిలను అందజేయాలని కోరారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం యూనిట్లు ఎంపికైన లబ్ధిదారులకు తక్షణ ఆ యూనిట్లు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క రకం వాళ్లను మత్స్యకారులు చేపల వేటకు వినియోగిస్తారని, ప్రభుత్వం గుర్తించిన సంస్థల వారి వద్ద వీరికి అవసరమైన వలలు ఇతర వత్తి పరికరాలు లభించడం లేదన్నారు. అందువల్ల ప్రత్యేక దష్టి సారించి అవసరమైన వత్తి ఉపకరణాలను అందించాలని నాగాంజనేయులు కోరారు.

పోస్టరును ఆవిష్కరిస్తున్న దృశ్యం

25న మహాధర్నాను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - గుడివాడ : కేంద్ర ప్రభుత్వం మెమో 57 ప్రకారం పాత పెన్షన్ సాధనకై ఆగస్టు 25న విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే మహాధర్నా పోస్టరును ఎన్‌జివో నాయకులు విడుదల చేశారు. ఆదివారం స్థానిక ఎన్‌జివో హూమ్‌లో మహా ధర్నా పోస్టర్‌ను జిల్లా ఎన్జీవో అధ్యక్షా, కార్యదర్శులు ఎస్.కె ఫరీద్‌భాష, జి.రాజేంద్ర ప్రసాద్ యుటిఎఫ్ కష్ణాజిల్లా గౌరవ అధ్యక్షులు నీలం ప్రభాకర్, ఎస్‌టియు కష్ణజిల్లా అధ్యక్షుడు డి.చంద్రశేఖర్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఏ.వి వరలక్ష్మి, యుటిఎఫ్ నాయకులు జి.రాజారావు, మేడ శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ కొమ్మనబోయిన లక్ష్మి శ్రీనాథ్, జి జయరాజు, ఫోరం సభ్యులు ఎస్.జయశ్రీ, కె.కష్ణకాంత్, ఆర్.జగదీష్, ఏలియా తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ మూడో వార్డులో ఉన్న అంకాలమ్మ అమ్మవారి వార్షిక జాతర వైభవంగా జరిగింది. శ్రావణమాసం ఆదివారాన్ని పురస్కరిం చుకొని రజకులు కుండలో ఉన్న అమ్మవారిని నెత్తి మీద పెట్టుకొని కృష్ణా నది వరకు మేళ తాళాలు డప్పు కోలాటాలతో ఊరేగింపుగా వెళ్లి కష్ణానది స్నానమాచరించి అమ్మవారికి నూతన వస్త్రాలను సమర్పించి తిరిగి దేవాలయానికి విచ్చేసి యథా స్థానంలో అమ్మవారిని ప్రతిష్ఠించారు. అనంతరం భారీగా అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో రజకులు , స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందనలు

ప్రజాశక్తి - గుడివాడ : రాష్ట్ర స్థాయిలో ఉత్తమ బాలికల ఉన్నత పాఠశాలగా గుడ్లవల్లేరు మండలం అంగళూరు బాలికల ఉన్నత పాఠశాల అవార్డు పొందడం పట్ల ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే రాము స్వగృహంలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఉత్తమ పాఠశాల అవార్డు అందుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగన్మోహన్రావు, ఉపాధ్యాయ బందం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు 74 మంది ఉత్తీర్ణులు కావడం, 71 మందికి ఫస్ట్ క్లాస్ రావడం అభినందనీయమన్నారు. 571 మార్కులతో కతిజ తెహరా అనే విద్యార్థిని సైనింగ్ స్టార్ అవార్డు సాధించడంతోపాటుగా త్రిపుల్ ఐటీకి ఎంపిక అవడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు బూరగడ్డ శ్రీకాంత్, అంగలూరు పాఠశాల అధ్యాపక బందం పాల్గొన్నారు.

మన కోసం మనం ట్రస్ట్‌కు విరాళం

ప్రజాశక్తి-చల్లపల్లి : స్వచ్ఛ సుందర చల్లపల్లి సాధనలో భాగంగా అభివద్ధి చేపలు పడుతున్న మనకోసం మనం ట్రస్టుకు ప్రముఖ వైద్యులు డాక్టర్ నాగరాణి 20 వేల రూపాయలు విరాళం అందజేశారు. గుంటూరు కళాశాల వైద్య బందంలో పూర్వ విద్యార్థుల బందంలో నాగరాణి చల్లపల్లి సందర్శించారు. చల్లపల్లికి తమ వంతు బాధ్యతగా విరాళం అందిస్తున్నట్లు తెలిపారు. ట్రస్ట్ మేనేజింగ్ డాక్టర్ డి ఆర్ కె ప్రసాద్ కు ఆదివారం చెక్కును అందజేశారు. హిందూ శ్మశానం అభివద్ధికి స్థానిక గౌడ పాలెం కు చెందిన మురారి శివశంకర్ కుమారుడు సాత్విక్ పదివేల రూపాయలు విరాళాన్ని డా. డిఆర్ కే ప్రసాద్ దంపతులకు అందించారు.

ఉచిత వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి వాసవి క్లబ్ ఆదివారం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు జరిగాయి. 175వ ఉచిత కంటి శుక్లాల శిబిరాన్ని గ్రామ ఉపసర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ ప్రారంభించారు. శిబిరంలో డాక్టర్ మోహన్‌రావు 50 మందిని పరీక్షించి 17 మందికి ఐ ఓ ఎల్ శస్త్ర చికిత్స అవసరాలను గుర్తించారు. హెూమియో శిబిరంలో రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. సమాజ సేవలో ఆర్యవైశ్యులు ముందు ఉంటారని, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని ఉపసర్పంచ్ నాని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు మాజేటి అమరవాణి, గోళ్ళ వెంకటరత్నం, జూపూడి కిరణ్, దింటకుర్తి జ్యోతి,హరదా వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-కంకిపాడు : పెనమలూరు మండలం లోని గోసాల గ్రామం భద్రావతి గ్రూపు సభ్యురాలు బిల్లా రాజ్యలక్ష్మికి 50 వేల విలువైన ఎగ్ కార్ట్, సామాగ్రిను ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఆదివారం అందించారు. పోషకాహార లోపాలను నివారించే క్రమం లో కోడిగుడ్ల వాడకాన్నీ ప్రోత్సహించే విధంగా నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ (నెక్) వారితో ఒప్పందం చేసుకున్న కూటమి ప్రభుత్వంలో సెర్ఫ్ అధికారులు.ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి ఎగ్ కార్ట్‌లను డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు ప్రోత్సా హకం అందించేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ఎగ్ కార్ట్ లను అందిస్తున్నామని బోడే ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, డ్వాక్రా మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : టిడిపి అవనిగడ్డ నియోజకవర్గ వాణిజ్య విభాగపు అధ్యక్షులు ఘంటసాల రాజమోహన్రావు (కన్నయ్య) పుట్టినరోజు వేడుకలు పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకుల తో కలిసి రాజమోహన్రావు చేత కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు కార్యకర్తలతో పాటు ఆర్యవైశ్య నాయకులు, అభిమానులు, పాల్గొనగా రాజమోహన్రావును శాలువాతో సత్కరించారు.

వావిలాల పిఎసిఎస్ చైర్మన్‌గా పట్టాభి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - తిరువూరు

తిరువూరు మండలంలోని వావిలాల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా చేకూరి పట్టాభి ప్రమాణస్వీకారం చేశారు. వావిలాల పిఎసిఎస్ సొసైటీలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పట్టాభి చేత చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేయించారు. చిన్న, సన్నకారు రైతులు, చిరు వ్యాపారులు, గేదెల పెంపకందారులకు సొసైటీ ద్వారా రుణాలు మంజూరు చేసి వారి ఆర్థిక స్వావలంబనకు సహకరించాలని ఎమ్మెల్యే సూచించారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను వినియోగించుకోండి

- నగర కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతోపాటు మూడు సర్కిళ్ల కార్యాలయాల్లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని, దీనిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని నగరకమిషనర్ ధ్యానచంద్ర కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ... ఆయా విభాగాల ఉన్నతాధికారులు నిర్దేశించిన సమయంలోగా హాజరుకావాలని కోరారు.

మహిళను బెదిరించిన యూట్యూబ్ విలేకరులు - కేసు నమోదు

ప్రజాశక్తి-మైలవరం

మహిళలను బెదిరించి ఆమె వద్ద నుండి రూ.20 వేలు వసూలు చేసిన యూట్యూబ్ విలేకరులపై మైలవరం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మైలవరం మండలం పొందుగల గ్రామానికి చెందిన జి అశోక్, ఏ కొండూరు మండలం చీమలపాడుకు చెందిన ప్రకాష్‌లు మైలవరం నియోజకవర్గంలోని మండలాల్లో విలేకరుల మంటూ, వాట్సాప్, పత్రికల పేర్లు చెప్పుకుంటూ పలువురిని బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మైలవరం మండలంలోని జంగాలపల్లి గ్రామానికి చెందిన వీరిశెట్టి రుక్మిణి వద్దకెళ్లి మీ ఇంట్లో రేషన్ బియ్యం ఉన్నాయి, మాకు అడిగినంత ఇస్తే మీకు ఏ ఇబ్బంది రాకుండా చూసుకుంటామని, లేకపోతే మాతోపాటు ఇంకా కొంతమంది వస్తారని బెదిరించడంతో రుక్మిణి ఎనిమిది వేల రూపాయలు ఫోన్‌పే చేసింది. మరో 12 వేల రూపాయలను క్యాష్ రూపంలో ఇచ్చింది. కొంత సమయం తర్వాత వచ్చిన వాళ్ళు నకిలీ అని తెలుసుకొని మైలవరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

జగ్గయ్యపేట మండలంలోని జయంతిపురం గ్రామంలో ముత్యాలమ్మ తల్లి గుడికి ప్రహరీ గోడ శంకుస్థాపన, అమ్మవారి పూజ కార్యక్రమంలో ఆదివారం జగ్గయ్యపేట నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మట్టా ప్రతాప్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బూడిద నర్సింహారావు, రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి నంబూరి రవి, నియోజకవర్గ ఎస్టీ సెల్ బాణావత్ రాజు, గ్రామ పార్టీ అధ్యక్షులు మూడవత్ నరసింహారావు, పట్టణ యువజన ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ళ సురేష్, బాణావత్ సరస్వతి, వడకప్పుల మల్లికార్జునరావు, మెగావత్ బాలాజీ నాయక్, బాణావత్ పాండు, తదితరులు పాల్గొన్నారు.

'రిటైనింగ్ వాల్'కు నిధులు కేటాయించాలి

సిపిఎం ఫ్లోర్ లీడర్ సత్యబాబు

కూలిపోయిన రిటైనింగ్ వాల్‌ను పరిశీలిస్తున్న సత్యబాబు

ప్రజాశక్తి- విజయవాడ సిటీ

కొండ ప్రాంతాల్లో రిటైలింగ్ వాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని సిపిఎం ఫ్లోర్ లీడర్ సత్య బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ 49 డివిజన్ బ్రెజర్ పేట పెద్దిరాజుల వీధి నుండి జగు పిల్ల రామారావు వీధి వరకు ఉన్న రిటైనింగ్ వాల్ ఇటీవల కురిసిన వర్షాలకి కూలిపోయింది. ఈ ఘటనలో బుల్లి రాజేశ్వరి రేకుల షెడ్డు, అరసవల్లి మణి రేకుల ఇల్లు ధ్వంసమయ్యాయి. ఘటనా స్థలాన్ని ఆదివారం బి.సత్య బాబు సందర్శించారు. విజయవాడ నగరంలో ఉన్న 16 కొండ ప్రాంతాల్లో చిన్నపాటి వర్షాలకు రిటైనింగ్ వాల్ కూలి కొండ చర్యలు జారిపడి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా పాలకులు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. పడిపోయిన రిటైనింగ్ వాల్‌ను వెంటనే నిర్మించే విధంగా మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దెబ్బతిన్న ఇళ్ల నిర్మాణానికి నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. విజయవాడ నగరానికి రావలసిన గ్రాంట్లు రూ.624 కోట్ల వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో డివిజన్ కార్యదర్శి జి బాల దుర్గారావు, ఎన్ గురప్ప, నాయకులు పి శ్రీను,ఎస్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి క్యూ లైన్ల నమూనాలు పరిశీలన

ప్రజాశక్తి -విజయవాడ సిటీ

క్యూలైన్లను పరిశీలిస్తున్న ఇఒ

సెప్టెంబర్ 22 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు 11 రోజులు జరిగే దసరా ఉత్సవాలలో భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం, ప్రజా ప్రతినిధుల ఆకాంక్షలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఇఒ వికె. శీనానాయక్ తెలిపారు. ఆదివారం ఉదయం దసరా ఏర్పాట్లు పర్యవేక్షణ చేశారు. సి.వి.రెడ్డి చారిటీస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నమూనా క్యూ లైన్‌ను పరిశీలించి, కొన్ని మార్పులను ఇఒ సూచించారు. యాత్రికులకు మరిన్ని సదుపాయాలు కల్పించడానికి గతం కంటే భిన్నంగా, అధునాతనంగా దసరా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇఒ పేర్కొన్నారు. దసరా ఉత్సవాల్లో సాధారణ రోజుల్లో రోజుకు 65 వేల నుండి 80 వేల మంది, మూలా నక్షత్రం రోజు 2 నుండి 3 లక్షల మంది యాత్రికులు వస్తారని అంచనా ఉండగా, వన్‌టౌన్ వినాయక టెంపుల్ నుండి కొండ పైకి ఏర్పాటు చేసే దర్శన క్యూ లైన్ నిర్మాణంలో మార్పు చేసి, యాత్రికులకు సౌకర్యవంతంగా, భద్రత పరంగా మెరుగ్గా ఉండేలా చూస్తున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్ రూట్ లో అటు కుమ్మరి పాలెం సెంటర్ నుండి కూడా ఇదే విధంగా క్యూ లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి. రాంబాబు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి. వి. రెడ్డి, పాల్గొన్నారు.

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్లు ప్రారంభించండి

- ఇండియన్ అంబేద్కర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి తారకప్రసాద్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభించాలని ఇండియన్ అంబేద్కర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి తారకప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యూనివర్సిటీ ఏర్పాటుకు కేబినెట్ నిర్ణయం తీసుకునే ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ ఇంత వరకు కార్యరూపం దాల్చలేదని, వెంటనే యూనివర్సిటీ స్టాఫ్‌ను వైస్ ఛాన్సలర్‌ను, రిజిస్ట్రార్, రెక్టర్, ప్రొఫెసర్లను నియమించి అడ్మిషన్స్ ప్రారంభించాలని, లేకుండా విద్యా సంవత్సరం కోల్పోవలసి వస్తుందని తెలిపారు. విద్యా శాఖ మంత్రి లోకేష్ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. యూనివర్సిటీని ఏలూరులో కాకుండా అమరావతిలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంబేద్కర్ స్మృతి వనంలోని అంబేద్కర్ కన్వెన్షన్ సెంటర్‌ను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకు రావాలని ప్రభుత్వాన్ని కోరారు. స్కాలర్‌షిప్ వెంటనే విడుదల చేయాలని, అంబేద్కర్ గురుకుల విద్యాలయాలలో వసతులు కల్పించాలని సూచించారు. రైల్వే, బ్యాంకింగ్ ఉద్యోగాలకు శిక్షణ ఇవ్వాలని, సబ్ ప్లాన్ నిధులను ఎస్‌సిల అభివద్ధి కోసం ఖర్చు చేయాలని కోరారు.

వరద ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

జగ్గయ్యపేట : జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల్లో జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరద ప్రాంతాలను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. లింగాల బ్రిడ్జి మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట, వత్సవాయి మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.నితిన్, జగ్గయ్యపేట మండల తహశీల్దార్ ఎన్.మనోహర్, వత్సవాయి తహశీల్దార్, అధికారులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పుష్పాలంకరణ సేవ

జగ్గయ్యపేట : జగ్గయ్యపేట పట్టణంలోని చెరువు బజార్లో గల ముత్యాలమ్మ అమ్మవారి దేవాలయంలో శ్రావణమాసం 4వ ఆదివారం పుష్పాలంకరణ సేవ నిర్వహించారు. శ్రావణమాసం ఆఖరి ఆదివారం కావడంతో జగ్గయ్యపేట పరిసర ప్రాంతాల నుండి విచ్చేసిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకోవడంతో పాటు మొక్కులు తీర్చుకునేందుకు బారులు తీరారు. ఆలయ అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శనానికి ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

అధిక ధరలకు ఎరువుల విక్రయాలు

- లబోదిబోమంటున్న రైతులు
- చోద్యం చూస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ప్రజాశక్తి -ఏ కొండూరు

ములిగే నక్క మీద తాటికాయ పడ్డ చందంగా రైతుల దుస్థితి దయనీయంగా మారింది. గత సంవత్సరం మిర్చి, మామిడి, పత్తి పంటలను సాగు చేసిన రైతులు దిగుబడులు రాక, గిట్టుబాటు ధర లేక పంటలకు పెట్టిన పెట్టుబడులు చేతికి అందకపోవడంతో పీకల లోతు అప్పుల్లో కూరుకుపోయిన రైతులకు ఈ సంవత్సరం వ్యవసాయానికి పెట్టుబడులు సమకూర్చుకోవడం తలకు మించిన భారంగా మారింది. వ్యవసాయ పెట్టుబడులకు అందిన చోటల్లా అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుంటున్న రైతులకు ఎరువుల కొనుగోళ్లు రైతులను కలవరపెడుతున్నాయి. ఎరువుల దుకాణ యజమానులు ఎరువు కట్టలకు ప్రతి కట్టకు వంద రూపాయల వరకు అదనంగా వసూలు చేస్తుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. యూరియా లేకుండా ఎరువులను పొలాలలో వేయడం కుదరదు కాబట్టి ఎరువుల దుకాణాల యజమానులు ఎంత చెబితే అంతకు కొనాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం రూ.266.50 అమ్మాల్సిన యూరియా కట్టను ఎరువుల దుకాణాల యజమానులు రూ.350 వరకు అమ్ముతున్నట్లు రైతుల ద్వారా తెలుస్తోంది. అంతేకాక గ్రోమోర్‌లో ఎరువుల అమ్మకాలకు బయట ఎరువుల దుకాణాలలో అమ్మకాలకు ప్రతి కట్టకు 100 రూపాయలు అదనంగా తేడా ఉంటున్నట్లు రైతుల ద్వారా తెలుస్తుంది. గ్రోమోర్‌లో 2020 రకం రూ.1350లు కాగా ఎరువుల దుకాణాలు రూ. 1450 వరకు అమ్ముతున్నారు. అలానే 2828 రకం గ్రోమోర్లో రూ.1700 కాగా, బయట దుకాణాలు రూ.1800 నుండి రూ.1900, 1435 గ్రోమోర్ రూ.1800 కాగా దుకాణాల్లో రూ.1900లకు, 1026 రకం గ్రోమోర్ రూ.1800 కాగా దుకాణాల్లో రూ.1900 విక్రయిస్తున్నారు. అలానే డిఎపి రకం 1350 గ్రోమోర్‌లో అమ్ముతుండగా బయట ఎరువుల దుకాణాలలో రూ.1450లకు, సూపర్ ఎరువు కట్ట గ్రోమోర్ లో 535 అమ్ముతుండగా బయట రూ.600 వరకు పొటాష్ గ్రోమోర్‌లో రూ.1700లకు అమ్ముతుండగా బయట దుకాణాలలో రూ.1800ల వరకు అమ్ముతున్నారు. దుకాణాల యజమానులు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నా స్థానిక వ్యవసాయ అధికారులు తమకు ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇకనైనా వ్యవసాయ అధికారులు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్న దుకాణ యజమానులపై తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సమగ్రాభివృద్ధే ధ్యేయం

• కృష్ణాజిల్లా కలెక్టర్ డికె బాలాజీ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణాజిల్లాను అన్ని రంగాల్లో అభివద్ధి చేయటం ద్వారా జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికా బద్ధమైన కృషి, ఆలోచనలతో ముందుకెళ్తున్నామని జిల్లా కలెక్టర్ డికె బాలాజీ చెప్పారు. ఆయన ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. కృష్ణాజిల్లా పరిధిలోని అన్ని నియోజక వర్గాల పరిధిలో అభివద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. మహిళా సాధికారత దిశగా ప్రయత్నాలు ప్రారంభించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పి4 పథకం ద్వారా పేదల జీవన ప్రమాణాలు పెంచేలా, దీనిద్వారా వారి జీవన విధానం మెరుగు పర్చేందుకు కషిచేస్తున్నామన్నారు. రాబోయే మూడేళ్లలో జిల్లాలో ఔత్సాహికులైన మహిళలకు వత్తి విద్యల్లో శిక్షణ ఇప్పించి వారికి ఆర్థికంగా చేయూత ొనిచ్చేందుకు కషిచేస్తున్నామన్నారు.

కృష్ణాజిల్లాలో వస్త్ర, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను విస్తతంగా ఏర్పాటు చేయటానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వస్త్ర పరిశ్రమను మరింత ప్రోత్సహించేలా కషిచేస్తున్నామన్నారు. పలు చోట్ల క్లస్టర్ అభివద్ధి చేయటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కృష్ణాజిల్లా సమగ్రాభివద్ధికి దోహదపడే బందరుపోర్టును వీలైనంత త్వరగానే పూర్తిచేసేలా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చర్యలు తీసుకుంటున్నారన్నారు. మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులు శరవేగంతో జరుగుతున్నామన్నారు. పోర్టు నిర్మాణం పూర్తయితే సింగపూర్, చైనా, జపాన్ దేశాలకు ఎగుమతులు, దిగుమతులు పెరిగి ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ప్రజలకు మౌళిక వసతుల కల్పన, ఇతర పనుల నిమిత్తం 11,79 పనులతో రూ.16.57 కోట్లు పెట్టుబడితో అనేక పనులు పురోగతిలో ఉన్నాయన్నారు.

ఎస్ఎస్‌సిలో 95 శాతం, ఇంటర్లో 93 శాతం ఫలితాలు

కృష్ణా జిల్లాలోని సామాజిక సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు 2025 బోర్డు పరీక్షల్లో అద్భుతమైన ప్రదర్శన చూపారు. ఎస్ఎస్సిలో 95 శాతం, ఇంటర్మీడియట్లో 93 శాతం ఉత్తీర్ణత శాతం నమోదు చేయడం ద్వారా, రాష్ట్రంలో ఏ జిల్లా సాధించని రీతిలో అగ్రస్థానంలో నిలిచారు. 16 హాస్టళ్లు 100 శాతం ఫలితాలు సాధించడంతో ప్రభుత్వ విద్యా వ్యవస్థలో పెరుగుతున్న నాణ్యత స్పష్టమవుతోం దన్నారు. అలాగే మొత్తం 48 హాస్టళ్లలో రూ.3.2 కోట్ల వ్యయంతో మరమ్మతులు చేప ట్టారు. దీనివల్ల ఆ హాస్టళ్లలో నివసించే విద్యార్థులకు సురక్షి తమైన, గౌరవనీయమైన వసతి ఏర్పడింది.

గుల్లలమోద క్షిపణి పరీక్షా కేంద్రానికి పునాది

కృష్ణా మట్టిలో తొలి సారిగా హైసెక్యూరిటీ డిఫెన్స్ స్థాపన స్థానం దొరికింది. ప్రధాని నరేంద్రమోడీ చేతులమీదుగా ప్రారంభించబడిన డిఆర్డిఒ మిస్సైల్ టెస్టింగ్ రేంజ్ దేశ భద్రతలో వ్యూహాత్మక అడుగు మాత్రమే కాక, స్థానిక ఉపాధి, రవాణా, గౌరవాన్ని పెంచే అవకాశాలను తెరచిందని వివరించారు.

ఎన్ఐడిఎం రెండో క్యాంపస్ ప్రారంభం

గన్నవరం మండలం కొండపావూవులూరులో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ (ఎన్ఐడిఎం) దక్షిణ క్యాంపస్ను ప్రారంభించారు. విపత్తు ప్రమాద నివారణ, శిక్షణ, సామర్థ్యవఅద్ధిపై దష్టి సారించిన ఈ సంస్థ ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 44 కంటే ఎక్కువ కార్యక్రమాలు నిర్వహించి, 2,130 మందికి పైగా వాటితో సంబంధిత స్టేక్ హెూల్డర్లను శిక్షణ ఇచ్చింది.

20 వేల మంది రక్తహీనత నుండి దూరం

గ్రామీణ కష్ణాలో ఇప్పుడు మహిళలు రక్తహీనత భయంతో జీవించడం లేదు. భారీ స్థాయిలో నిర్వహించిన పోషణ కార్యాచరణ ద్వారా 23,497 మందికి పైగా మహిళలు పోషకాహార లోపం నుంచి బయటపడ్డారు. 30 వేల కిట్లు, 6,500 కౌన్సిలింగ్ సెషన్లు నిర్వహించాం. 23 శాతం రక్తహీనత రేటు తగ్గుదలకు ఒక కార్యక్రమం మాత్రమే కాదు, ఒక ఉద్యమంగా చేశాం. అందుకే మంచి సత్ఫలితాలను సాధించాం.

హరిత మైలురాళ్లు

గిట్టుబాటు వ్యవసాయం నుండి తరగతుల గదుల వరకు జిల్లాలో 28,540 మంది రైతులు 37 వేల ఎకరాల్లో నేచురల్ ఫార్మింగ్ స్వీకరించారు. అలాగే 106 జిల్లా పరిషత్ పాఠశాలల్లో పోషక తోటల రూపంలో ప్రకృతి వ్యవసాయాన్ని అభివృద్ధి చేశారు. ఇది శాశ్వతతకు విత్తనాలు వేసిన ప్రక్రియగా మారింది. మల్లవల్లిలో అశోక్ లేలాండ్ తొలి బస్ బాడీ బిల్డింగ్ యూనిట్ ప్రారంభమై జిల్లాలో మరో కీలక పారిశ్రామిక మైలురాయిగా నిలిచింది. దీపం 2 పథకం కింద కృష్ణా జిల్లాలో మొత్తం 3.6 లక్షల గ్యాస్ సిలిండర్ల లబ్ధిదారులకు 28 వేల వంటగ్యాస్ను ఉచితంగా పంపిణీ చేశాం.

పురోగతిలో వైద్య ఆరోగ్యం.

జిల్లాలో ప్రభుత్వ వైద్య సేవలు మరింత బలోపేతమయ్యాయి. పోరంకి, కానూరు ప్రాంతాల్లో కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, యనమలకుదురులో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభ మయ్యాయి. ఈ కేంద్రాల ద్వారా ఇప్పుడు లక్ష మందికి పైగా ప్రజలకు సమయానుకూల వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. నాణ్యమైన వైద్యం, ప్రజల ఇంటి ప్రగతి వాకిళ్ళ వరకూ చేరింది.

అభివద్ధికి పోర్టు దోహదం ...

అభివృద్ధికి నావికంగా మచిలీపట్నం పోర్ట్ దోహదపడుతుంది. ఇప్పటికే నిర్మాణ పనులు 40 శాతానికిపైగా పూర్తయ్యాయి. రూ.5,155 కోట్లతో నిర్మితమవుతున్న మచిలీపట్నం పోర్ట్ ఇప్పటికే 40 శాతం పూర్తయి మిగతా పనులు శరవేగంతో జరుగుతూ జిల్లాలోని ఆర్థిక ప్రగతికి కేంద్రబిందువుగా మారుతోంది. భవిష్యత్ సంపదకు ఈ నౌకాశ్రయం ముడిపడివుంది. 47,351 ఎకరాలు కొత్త ఆక్వా జోన్ల కిందకు వచ్చాయి. 787 మత్స్య జీవనాధార యూనిట్లు మంజూరయ్యాయి. స్థానిక సముదాయాలను ఆర్థికంగా శక్తివంతం చేస్తున్నాయన్నారు. రూ.6.5 కోట్ల సబ్సిడీతో ఫిష్ ఫీడ్ ప్లాంట్ తీరం వెంబడి నిర్మాణమవుతోంది. అలాగే పేదలకు రూ.5 కే భోజనం గుడివాడ, మచిలీపట్నం, పెడన, ఉయ్యూరులో ఐదు అన్నా క్యాంటీర్ల ద్వారా ప్రతిరోజూ సుమారు 1,000 మందికి కేవలం రూ.5కే భోజనం అందిస్తున్నాం. అలాగే గ్రామాల్లో 569 కిలోమీటర్ల రహదారులను మంచి రహదారులుగా ఆధునికంగా రూపొందించాం.

సూర్యఘర్‌తో కృష్ణాను ముందంజలో నిలిపాం

ప్రధాని సూర్యఘర్ పథకం కింద కృష్ణా జిల్లా 2,075 గఅహాల్లో రూఫ్ టాప్ సౌర వ్యవస్థలను ఏర్పాటు చేసి, 8 మెగావాట్ల స్వచ్ఛ శక్తిని ఉత్పత్తి చేసింది. లబ్ధిదారులు ఇప్పుడు నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ను పొందుతున్నారు. ఒక్క యూనిటు రూ.78 వేలు వరకూ సబ్సిడీ అందించబడటం వల్ల ఆదా, ఆత్మనిర్భరత, పర్యావరణ సుస్థిరతతో కూడిన భవిష్యత్తు వైపు అడుగులు వేస్తున్నారు.

6.64 లక్షల ధాన్యం సేకరణ

ఖరీఫ్, రబీ సీజన్లలో కృష్ణా జిల్లాలో 83,657 మంది రైతుల నుండి 6.64 మెట్రిక్ టన్నుల వరి సేకరించబడింది. రైతుల ఖాతాల్లో నేరుగా రూ.1,520 కోట్లు జమ చేయడంతో సమయానికి, పారదర్శకంగా సహాయం అందించబడింది. ఇది పొలంనుంచి ఆర్థిక వ్యవస్థ వరకు వ్యవసాయ జీవనోపాధులను బలోపేతం చేసింది.

ఉచిత ఇసుకకు ప్రాధాన్యత..

9 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలతో అభివృద్ధికి పునాది వేశాం. 1.8 లక్షల మెట్రిక్ టన్నులు ఇప్పటికే పంపిణీ చేయటంతో నిర్మాణ పనులు తక్షణ ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. 7.5 లక్షల మెట్రిక్ టన్ను లు జాగ్రత్తగా నిల్వలు వానాకాల డిమాండ్కు సిద్ధం. 5 అర్ధ యాంత్రిక రీచులు ఏర్పాటు. రాష్ట్రంలో మూడో స్థానంలో నిలుస్తూ,ఇసుక రవాణాలో కృష్ణాజిల్లా నాయకత్వాన్ని చాటింది.

'బ్లూ బస్'తో ప్రారంభమైన ఆరోగ్య విప్లవం

జిల్లాలో తొలిసారిగా కేన్సర్ స్క్రీనింగ్ కోసం ప్రత్యేకంగా రూపుదిద్దుకున్న "బ్లూ బస్" అనే వాహనాన్ని ప్రారంభించారు. దూర ప్రాంతాలు, వెనుకబడిన ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి 10,000కు పైగా అనుమానాస్పద కేసులను గుర్తించడం ద్వారా ఈ బస్ ముందస్తు గుర్తింపు, అవగాహన, సమయానుకూల వైద్య సూచనల కోసం ప్రాణాధారంగా మారింది. చక్రాలపై ప్రయాణించే ఈ సేవ ఆరోగ్య రంగంలో కీలకమైన లోటుపాట్లను భర్తీ చేస్తోంది.

నిశ్శబ్ద సాంకేతిక విప్లవం...

ప్రతి రైతు వేలికి సాంకేతికతను అందించిన నిశ్శబ్ద విప్లవంలో, 212 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు పూర్తిగా డిజిటలైజ్ అయ్యాయి. రాష్ట్రంలోనే అత్యధిక పిఎసిఎస్లు కంప్యూటరైజేషన్ సాధించి, లెడ్జర్ల నుండి లైవ్ డ్యాష్బోర్డుల వరకు, కష్ణా జిల్లా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బ్యాక్లాగ్ నుంచి రియల్టిమ్కి మార్చింది.

వరదపై విజయం

చరిత్రలోనే తొలిసారిగా కష్ణా నది 11 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన విపరీత వరదను చూశాం. అయినప్పటికీ, జిల్లాలోని వేగవంతమైన, సమన్వయ పూర్వకమైన విపత్తు నిర్వహణ ఈ సంక్షోభాన్ని నియంత్రణలోకి తెచ్చింది. 58 పడవలు, 164 ఈతగాళ్ల సహాయంతో 25,000 మందికి పైగా ప్రజలను సురక్షితంగా తరలించి, 63 ఉపశమన శిబిరాల్లో ఆశ్రయం కల్పించారు. ఇది కేవలం వ్యవస్థల పరీక్ష మాత్రమే కాదు. టీమ్ కష్ణా సహనశక్తికి నిదర్శనం.

నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం గన్నవరం మార్కెట్ యార్డులో ఘనంగా జరిగింది. ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు (నరసయ్య) (ప్రసాదంపాడు), ఉపాధ్యక్షులు కొండేటి వెంకటేశ్వరావు (పెదఅవుటపల్లి) ఇతర పాలకవర్గ సభ్యులతో ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రమాణం చేయించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ నూతన పాలకవర్గం ప్రస్తుతం రూ. 6.5 కోట్ల ఆదాయాన్ని సంవత్సర కాలంలో 8.30 కోట్లకి పెంచేలా పనిచేయాలని కోరారు. టీడీపీ నాయకులు బచ్చుల బోసు, గన్నవరం నియోజకవర్గ పార్టీ పరిశీలకులు వడ్రణం హరిబాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొట్టిపాటి రామకష్ణ ప్రసాద్,మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి బాలవర్ధనరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కలెక్టరేట్ సమావేశ హాలులో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక- మీకోసం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా ఇన్ఛార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం జరుగు తుందన్నారు. అలాగే మీకోసం కాల్ సెంటర్ నంబర్ 1100కు కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవచ్చన్నారు.

'స్వచ్ఛ సుందర చల్లపల్లి' సందర్శన

ప్రజాశక్తి-చల్లపల్లి : స్వచ్ఛ సుందర చల్లపల్లిని ఆదివారం వైద్యుల బృందం సందర్శించింది. స్వచ్ఛ సుందర చల్లపల్లి రథసారథి డాక్టర్ డి ఆర్ కె ప్రసాద్ తో కలిసి గుంటూరు మెడికల్ కళాశాలలో చదువుకున్న 1974వ బ్యాచ్ పూర్వ విద్యార్థుల బందం కుటుంబ సభ్యులతో కలిసి స్వచ్ఛ కార్యకర్తలతో సేవలందించి, కాసా నగర్ హైవే ప్రక్కన మొక్కలు నాటారు. వైద్య మిత్రులు డాక్టర్ డి ఆర్ కె ప్రసాద్, డాక్టర్ పద్మావతి నేతత్వంలో జరుగుతున్న స్ఫూర్తివంతమైన ఉద్యమాన్ని చూసేందుకు శనివారం సాయంత్రం చల్లపల్లి కి వచ్చారు. పద్మాభి రామంలో కోలాట ప్రదర్శనను తిలకించారు. గతంలో వారు నాటిన మొక్కలను చూసుకొని సంతోష పడి హైవే పక్కన మళ్ళీ మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ వ్యక్తిగత ప్రయోజనం లేకుండా గత 11 సంవత్సరాలుగా చేస్తున్న సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. డాక్టర్ పద్మ లక్ష్మి, డాక్టర్ బాలు, డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ సుధాకర్ బాబు,డాక్టర్ నీరద, డాక్టర్ నాగరాణి, డాక్టర్ రుద్ర,డాక్టర్ మాధవరావు, డాక్టర్ తారక్, డాక్టర్ ప్రసన్న,డాక్టర్ వీణ, డాక్టర్ భాను తదితరులు చల్లపల్లి సందర్శించిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, డాక్టర్ గోపాల కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

కార్యక్రమంలో భాగంగా మొక్క నాటుతున్న వైద్యులు

మైత్రి ఫౌండేషన్ సాయం

సాయం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం మండలం గరాలదిబ్బ గ్రామానికి చెందిన అంద్రాజు ఏసుబాబు వెల్డింగ్ పనులు చేస్తూ కరెంట్ షాక్‌తో కుడి కాలు, కుడి చేయి కోల్పోవడంతో ప్రస్తుతం ఏపనీ చేయలేక మంచానికే పరిమితమై భార్య చేసే కూలీనాలీ పనులతోనే ఆ కుటుంబం ఆధారపడుతోంది. గ్రామ పెద్ద బొడ్డు వీర వెంకటేశ్వరరావు (నాని)ద్వారా విషయం తెలుసుకున్న మైత్రీ ఫౌండేషన్ బందం తాత్కాలిక సాయంగా ఆదివారం ఆ కుటుంబానికి రెండు నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులు అందచేసి భవిష్యత్తులో వారికి వైద్య పరంగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మైత్రి ఫౌండేషన్ అధ్యక్షులు కేసాని వేణు కుమార్, ఉపాధ్యక్షులు ప్రసాద్,కార్యదర్శి దైవపు రాధా కష్ణ, ఫుడ్ కమిటీ చైర్మన్ అనిల్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు బొమ్మిశెట్టి ఎంపిక

ప్రజాశక్తి-గూడూరు : బాల్ బ్యాట్మెంటన్ క్రీడల్లో రాణిస్తూ జాతీయస్థాయిలో మంచి గుర్తింపుని సాధించాడు గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామానికి చెందిన బొమ్మిశెట్టి ప్రభు. ప్రకాశం జిల్లా చేవూరు క్రీడా ప్రాంగణంలో ఈనెల 29,30,31 తేదీలలో నిర్వహించే రాష్ట్రస్థాయి బాల్ బ్యాట్మెంటన్ పోటీలకు ఉమ్మడి కష్ణా జిల్లా నుంచి బొమ్మిశెట్టి ప్రభు ఎంపికైయ్యాడు. గన్నవరం సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ఆదివారం జరిగిన బాల్ బ్యాట్మెంటన్ పోటీల్లో క్రీడాకారులు ఎంపిక పోటీలు నిర్వహించారు. హాజరైన క్రీడాకారుల నుంచి ఉమ్మడి కష్ణ జిల్లా నుండి బాల్ బ్యాట్మెంటు జాతీయ క్రీడాకారుడు బొమ్మిశెట్టి ఎంపిక అవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఉచిత బస్సులతో ఆటో స్టాండ్లు వెలవెల

ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించడంతో ఆ ప్రభావం ఆటోలపై పడింది. ప్రయాణికులతో రద్దీగా ఉండే ఆటో స్టాండ్లు వెలవెలబోయాయి. స్త్రీ శక్తి పథకం ఆటో కార్మికులను రోడ్డునపడేసింది. ఆటోలు అద్దెకు తీసుకుని తిప్పే వారికి కనీసం అద్దె చెల్లించడానికి కూడా కిరాయి రాని పరిస్థితి నెలకొంది. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో తమ పరిస్థితి దారుణంగా మారే ప్రమాదం ఉందని, ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించాలని ఆటో డ్రైవర్లు కోరుతున్నారు.

ప్రజాశక్తి-నందిగామ

నందిగామలోని మధిర ఆటో స్టాండ్, శనగపాడు ఆటో స్టాండ్, రైతుపేట ఆటో స్టాండ్ , చందర్లపాడు ఆటో స్టాండ్, పాతబస్టాండ్ ఆటో స్టాండ్, కీసర ఆటో స్టాండ్, కంచికచర్ల ఆటో స్టాండ్ల వద్ద ప్రయాణికులు లేక ఆటోలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ప్రతిరోజు నందిగామలో ఆటో స్టాండ్ల వద్ద రోజుకి 50కి పైగా ఆటోలు ఉండగా వందల మంది ప్రయాణికులు ఆటోలలో ప్రయాణించేవారు. స్త్రీ శక్తి పథకం రావడం వల్ల శని, ఆదివారాల్లో ఒక ట్రిప్ వేయడం కూడా గగనంగా మారిందని రైతు పేట చెందిన ఆటో స్టాండ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు రవికుమార్ ఆందోళన వ్యక్తం చేయడం జరిగింది. ఆటోలు అద్దెకు తీసుకొచ్చి తిప్పుకున్న వారికి కనీసం ఆటోఫైనాన్స్ చెల్లించడానికి కూడా కిరాయి రాని పరిస్థితి నెలకొంది. ఉచిత బస్సు ప్రయాణ పథకం ఆటో కార్మికులకు తీవ్రమైన దెబ్బ కొట్టిందని శనగపాడు ఆటో స్టాండ్ వర్కర్ సీనియర్ నాయకుడు కిషోర్ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఆటో కార్మికులకు పదివేల రూపాయలు చొప్పున ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసేదని, ప్రస్తుతం ఒక పక్క ఆటో ఫైనాన్స్ కట్టలేక, కిరాయిలు లేక ఆటో అద్దె చెల్లించలేక ఆర్థికంగా మానసికంగా శారీరకంగా కూడా ఇబ్బందులు పడుతున్నామని మరో ఆటో కార్మికుడు శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. అడవిరావులపాడు చెందిన ఆటో కార్మికుడు రాఘవాపురపు వెంకటనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

వాహన మిత్ర అమలు చేయాలి...
సురేష్ ఆటో డ్రైవర్

స్త్రీ శక్తి పథకం, ఉచిత బస్సు ప్రయాణం ఆటో కార్మికుల పొట్ట కొట్టింది. ఉదయం నుండి సాయంత్రం వరకు నూట యాభై రూపాయల కిరాయి రాలేదు. ఇంటి కిరాయి, బండి ఫైనాన్స్, స్కూల్ ఫీజులు చెల్లించలేక పోతున్నాం. వాహన మిత్ర పథకం తక్షణమే అమలు చేసి ఆటో కార్మికులందరికీ 15 వేలు చొప్పున ప్రభుత్వం ఇవ్వాలి.

జిఒ 21 రద్దు చేయాలి..
అను రాజు... ఆటో డ్రైవర్

ఆటో కార్మికులందరికీ శాపం గా మారిన జిఒ 21 రద్దు చేయాలి. ఆటో లపై కేసులు ఎత్తి వేయాలి. ఒకప్పుడు ఆటో బ్రేక్ చేసుకోవటానికి నందిగామ ఆర్‌టిఒ కార్యాలయం కి వెళ్లే వాళ్లం. ఇప్పుడు విజయవాడ, నున్న వెళ్లి రావటానికి వ్యయప్రయాసలు పడుతున్నాం.

చలానాలు చెల్లించలేకపోతున్నాం : నాగరాజు, ఆటో డ్రైవర్

నందిగామలో ఆటో ఫైనాన్స్ వారు నిలువు దోపిడీ చేస్తున్నారు. కిరాయిలు లేక కిస్తీలు కట్టలేకపోతున్నాం. వాహన మిత్ర పథకం ద్వారా తక్షణమే ఆటో కార్మికులందరికీ రూ. 15 వేల చొప్పున ఇవ్వాలి.

నందిగామ ఆటో స్టాండ్‌లో ఆటోలు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా ఈ నెల 15 నుండి అమలులోకి వచ్చిన "స్త్రీ శక్తి" పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కలుగుతుంటే, ఆటో కార్మికులకు మాత్రం ఊహించని విధంగా నష్టపోతున్నారు. మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో కార్మికులు ఉదయం నుండి రాత్రి వరకు ఆటోలు నడిపినా కనీసం కూలి కూడా రావడం లేదని ఆటో కార్మికులు ఆవేదన చేస్తున్నారు. ప్రభుత్వం తమను కూడా ఆదుకోవాలని ఆటో కార్మికులు కోరుతున్నారు.

రోడ్డునపడతాం
- చాట్ల వెంకటరత్నం, ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులు. రెడ్డిగూడెం.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. ఈ వత్తిని నమ్ముకుని, ఇదే జీవనాధారంగా జీవిస్తున్నాం. ఈ పని తప్ప ఏ పనీ చేయలేం. మూడు రోజులుగా కనీసం రూ.వంద కూడా ఇంటికి తీసుకెళ్లటం లేదు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి
-సిహెచ్ సుధాకర్, సిఐటియు జిల్లా కార్యదర్శి

ఆటో కార్మికుల సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోవడంతో గత మూడు రోజులుగా ఆటోలు ఇళ్లకే పరిమితమైనాయి. ఆటోలు ఇఎంఐలు, కుటుంబ పోషణ, పిల్లల చదువులు, ఇంటి అద్దెలు మొదలైనవి సమస్యలుగా మారే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఆటోలకు విధించే అన్ని రకాల టాక్స్‌లు మినహాయించాలి. ఆటో కార్మికులపై పోలీసుల వేధింపులు ఆపాలి, ఫైన్‌లు విధించకూడదు. ప్రభుత్వం నుండి ఆర్థిక భరోసా కల్పించాలి.

చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్టు

ప్రజాశక్తి-మైలవరం

మైలవరంలో అర్ధరాత్రి సమయంలో దొంగతనానికి పాల్పడుతున్న ఒకరిని మైలవరం పోలీసులు అరెస్టు చేశారు. మైలవరంలో దొంగల హల్ చల్ శీర్షికన ప్రజాశక్తిలో ఈ నెల 17న వార్త వెలువడింది. దీనిని ఛాలెంజ్‌గా తీసుకున్న సిఐ దాడి చంద్రశేఖర్, ఎస్ఐ సుధాకర్లు ఆదివారం అనుమానితులను విచారణ చేపట్టారు. విచారణలో ఈ నెల 14వ తేదీన మైలవరం ఎస్వీఎస్ నగర్‌లోని ఓ ఇంటిలో దొంగతనానికి ఒకరు ప్రయత్నించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు మైలవరం యాదవ బజారుకు చెందిన బట్ట కిషోర్‌ను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ సుధాకర్ మాట్లాడుతూ కిషోర్ చెడువ్యసనాలకు బానిసై దొంగతనాలకు పాల్పడుతున్నట్లు వివరించారు. కిషోర్‌పై కుటుంబ సభ్యులను వేధిస్తున్నట్లు కూడా ఫిర్యాదు ఉందన్నారు. మైలవరంలో అపరిచిత వ్యక్తులు ఎవరైనా కనిపించిన, రాత్రి వేళల్లో అనుమానంగా ఉన్న వెంటనే మైలవరం పోలీస్ స్టేషన్కు సమాచారం తెలియజేయాలన్నారు. పట్టణంలో ఎవరైనా ఇంట్లో దొంగలు పడిన స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ప్రజాశక్తి జగ్గయ్యపేట

జగ్గయ్యపేట మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన రాచమంటి శంకర్, లక్ష్మి దంపతులు రూ.25,116 విరాళంగా అందజేశారు. దాతలకు ఆలయ అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ సిబ్బంది శ్రీ స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి అధికారి నూతక్కి సాంబశివరావు తెలిపారు.

స్వర్గపురిలో షెడ్ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - తిరువూరు

తిరువూరు మునుకుళ్ల రోడ్డులోని స్వర్గపురిలో నూతన షెడ్ నిర్మాణానికి బెస్ట్ ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు విరాళం అందజేశారు. సభ్యులందరూ కలిసి సేకరించిన రూ.లక్ష విరాళాన్ని ఆదివారం స్వర్గపురి నిర్వహణ కమిటీ సభ్యులైన తోసా గ్రూప్ ప్రతినిధులకు అందజేశారు. స్వర్గపురిలో దహన సంస్కారాలకు చేసుకునే వారికి ఉపయోగ పడే విధానంగా నిర్మిస్తున్న షెడ్ కు బెస్ట్ ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు విరాళం ఇవ్వటం అభినందనీయమని తోసా సభ్యులు తెలిపారు.

కోతుల దాడులతో బెంబేలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

కోతులు, కుక్కల బెడదతో మండలంలోని షేర్ మహ్మద్ పేట గ్రామంలో బెంబేలెత్తుతున్నారు. గ్రామంలోని చెరువు సమీపంలో కోతులు సంచారం ఎక్కువగా ఉందని గ్రామపంచాయతీ అధికారులు అక్కడ ఉన్నటువంటి చెట్లను తొలగించారు. దీంతో ఆ ప్రాంతం నుండి ఎర్రగడ్డ బజార్, మోడల్ కాలనీ, ఎస్సీ కాలనీలో కోతుల సంచారం ఎక్కువగా ఉంది. ఇండ్లలో ఉన్నటువంటి ఎటువంటి వస్తువులను చెల్లాచెదురు చేస్తున్నాయి. అడ్డుకున్న వారిపై విచక్షణారహితంగా కరచి గాయపరుస్తున్నాయి. ఇప్పటికే సుమారు ఒక 20 మందిని గాయపరిచాయి. కోతులు అంటే గ్రామ ప్రజలు భయపడిపోతున్నారు. తాజాగా ఆదివారం గ్రామంలో చన్నీళ్ల శ్రీనివాసరావు ఇంట్లోకి దూరిన కోతుల గుంపు ఇంట్లో గల వస్తువులను తీసుకెళ్తుండగా అడ్డుకున్న శ్రీనివాసరావుపై 5 కోతులు దాడి చేసి గాయపరిచాయి. దీంతో కాలుపై గాయం కాగా 5 కుట్లు పడ్డాయి. కోతులు, కుక్కలు సమస్య ప్రబలంగా ఉందని ఎన్నోసార్లు గ్రామపంచాయతీ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు ధర్నాలు చేసి గ్రామపంచాయతీ అధికారులకు, మండల పరిషత్ అభివద్ధి అధికారి, తాశీల్దార్‌కు పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ సమస్య పరిష్కారమైన దాఖలాలు లేవు. ఇప్పటికైనా గ్రామంలో గల కోతులు, కుక్కల సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జెవివి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - తిరువూరు

జనవిజ్ఞానవేదిక (జెవివి) తిరువూరు శాఖ ఆధ్వర్యంలో స్థానిక నాగార్జున పాఠశాలలో ప్రతి రెండు నెలలకు ఒక్కసారి మూడవ ఆదివారం నిర్వహించే రెగ్యులర్ వైద్య శిబిరానికి 950 మంది రోగులు హాజరయ్యారు. వైద్య శిబిరానికి తిరువూరు పరిసర ప్రాంతాల నుండే కాకుండా సరిహద్దు జిల్లాలైన ఏలూరు, ఖమ్మం జిల్లాల నుండి వచ్చిన షుగరు, బిపి, మూర్ఛ రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి రెండు నెలలకు సరిపడ మందులను అందచేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ బి.పి, షుగర్ కేవలం మందుల వాడకంతోనే నియంత్రణలో ఉండవని, సరైన ఆహార నియమాలు పాటించాలని తెలిపారు. వీటితో పాటు రోజులో రెండుసార్లు మాత్రమే ఆహారం తీసుకోవాలని, ఒక్కపూట తప్పు నిసరిగా తణ ధాన్యాలను వాడాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని రోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సత్య తేజ, వి.రవీంద్ర, లక్ష్మణరావు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

జగ్గయ్యపేట పట్టణం సమీపంలోని విఎస్‌పి క్వార్టర్స్ ప్రాంగణంలో శ్రీ భూ సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం కష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారికి పంచామతాభిషేకం ప్రత్యేక అలంకారాలను నిర్వహించారు. సాయంత్రం కష్ణుడు గోపికల వేషాలలో చిన్నారులు శ్రీకష్ణుని కీర్తనలను ఆలపిస్తూ గోపికలు నత్యాలను చేశారు. ఈ కార్యక్రమంలో జేఎల్ఎం ఉద్యోగ ప్రముఖులు కిరణ్ కుమార్ సింగ్ దంపతులు, డాక్టర్ కుసుమ నరేష్ దంపతులు, హేమ నాయక్ దంపతులు పలువురు చిన్నారులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పలుచోట్ల పిఎసిఎస్ కమిటీల ప్రమాణస్వీకారం

ప్రమాణ స్వీకారం చేస్తున్న మచిలీపట్నం మండలం కానూరు పిఎసిఎస్ త్రిసభ్య కమిటీ

కానూరు పిఎసిఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం మండలం కానూరు ప్రాధమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పి ఏ సీ ఎస్.)త్రిసభ్య కమిటీ చైర్మన్ గోపు ప్రతాప్ నరేష్ కుమార్, సభ్యులు గా దివి మహేష్, చెక్క నాగరాజు లు ఆదివారం పదవి స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కృష్ణా జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ రైతులు దేశానికి వెన్నుముక అని అలాంటి రైతులకు సేవ చేసే భాగ్యం పి ఏ సి ఎస్ ల ద్వారా కలగడం నూతన కార్యవర్గం అదష్టమన్నారు. శిథిలావస్థకు చేరిన బ్యాంకు నూతన భవనం నిర్మాణానికి తన వంతు కషి చేస్తానన్నారు. చైర్మన్ గా ప్రమాణస్వీకారం చేసిన గోపు ప్రతాప్ నరేష్ కుమార్ మాట్లాడుతూ రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. సిఈ ఓ శ్రీనివాసరావు, పలువురు కూటమి నాయకులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-ఉయ్యూరు : ధాన్యం అమ్మిన రైతులకు సకాలంలో డబ్బులు, రాయితీపై వ్యవసాయ, యంత్రపనిముట్లు, అన్నదాత సుఖీభవ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ రైతు సంక్షేమం, అభివద్ధికి కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. బోళ్లపాడులో ఆదివారం పీఏసీఎస్ పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని చైర్మన్‌గా గుంటక లక్ష్మీనారాయణరెడ్డి, డైరెక్టర్లుగా తాబేటి యోహెూను, కుక ్కల చక్రవర్తిచేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సహ కార సంఘాలకు నియమితులైన పాలకవర్గాలు రైతులకు మేలైన సేవలందించి ప్ర భుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్ కుమార్, తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉయ్యూరు మండలం బోళ్లపాడులో మాట్లాడుతున్న ఎంఎల్ఎ బోడే ప్రసాదు



కంకిపాడు మండలం పునాదిపాడులో....

పునాదిపాడు పిఎసిఎస్ కమిటీ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలంలోని పునాదిపాడు పిఎసిఎస్ చైర్మన్ గా యార్లగడ్డ సుబ్రహ్మణ్యం, డైరెక్టర్లుగా గోలి దుర్గాప్రసాద్,కవిరి రమణయ్యలు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ సమక్షంలో ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో యార్డు చైర్మన్ అన్నే ధనయ్య, సర్పంచ్ ముసిబోయిన విజయలక్ష్మి, కీలక నేత తుమ్మలపల్లి హరికష్ణతో పాటు ముఖ్య నేతలు అనుమోలు శ్రీనివాసరావు, మద్దాలి సాయిబాబు, కాసరన్నేని కరుణ, కవిరి సంజీవరావు పాల్గొన్నారు.

రైతులకు ఉత్తమ సేవలు అందించాలి

ప్రజాశక్తి-చల్లపల్లి : పీఏసీఎస్ ద్వారా రైతులకు ఉత్తమ సేవలు అందించాలని పలువురు వక్తలు కోరారు. ఆదివారం చల్లపల్లిలో పీఏసీఎస్ అధ్యక్షులు బొందలపాటి వీరబాబు అభినందన సభ జరిగింది. ముఖ్య అతిధులుగా ఏపీ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ విచ్చేసి వీరబాబు, సభ్యురాలు విశ్రాంతమ్మలను ఘనంగా సత్కరించారు. సొసైటీ అభివద్ధికి, రైతుల ఆర్థిక ప్రగతికి బాటలు వేయాలని కోరారు. రుణాల మంజూరు, యూరియా సరఫరా, ధాన్యం కొనుగోలు సమర్ధవంతంగా నిర్వహించి రైతుల మన్ననలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోట విజయ రాధిక, సర్పంచులు పైడిపాముల కృష్ణకుమారి, కొల్లూరి కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్, పీఏసీఎస్ సభ్యుడు హరికష్ణ, ఎంపీటీసీ సభ్యులు పైడిపాముల స్వప్న, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు మోర్ల శివ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళాల వెల్లువ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక సంతరోడ్‌లోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు గొల్లపూడికి చెందిన దాత మాచినేని అరవింద్ గోష్ రూ.50వేలు విరాళం ఇచ్చారు. ఈ విరాళాన్ని గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావుకు అందించారు. అలాగే కోడె జనార్ధన రూ.5,116 విరాళంగా అందజేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్య చౌదరి, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా పాల్గొన్నారు.

370 పింఛన్లు తొలగింపు

ప్రజాశక్తి-మొవ్వ : గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత దివ్యాంగులు, మంచానికే పరిమితమైన రోగుల పెన్షన్లు పరిశీలించిన అనంతరం 370 మందిని అనర్హులుగా గుర్తించి సెప్టెంబర్ నెల నుంచి పెన్షన్లు నిలిపి వేసేందుకు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగానే 15 వేలరూపాయలు తీసుకునే లబ్ధిదారులలో నలుగురిని పూర్తి అనర్హులుగా గుర్తించారు. దివ్యాంగుల పెన్షన్ 6 వేల రూపాయలు తీసుకునే లబ్ధిదారులలో 366 మందిని అనర్హులుగా గుర్తించారు. అయితే15 వేల రూపాయలు తీసుకునే లబ్ధిదారులలో 26 మందిని దివ్యాంగుల పెన్షన్లుకు, అదేవిధంగా 15 వేల రూపాయలు పెన్షన్లు తీసుకునే లబ్ధిదారులలో 25 మందిని వద్ధాప్య పెన్షన్కు కన్వర్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పెదపూడి సచివాలయంలో 35, పెదముత్తేవిలో 10, అవురుపూడిలో 33, చినముత్తేవిలో 20, భట్లపెనుమర్రులో 20, మొవ్వ-1 లో 32, మొవ్వ-2 లో 18, కూచిపూడి లో 30, కోసూరులో 31, నిడుమోలులో 25, మంత్రిపాలెంలో 29, అయ్యంకిలో 23, పెడసనగల్లులో 15, వేములమడలో 9, కాజ-1లో 16, కాజ-2 లో20 తొలగించారు. అలాగే 15 వేల రూపాయలు పెన్షన్లు అయ్యంకి, నిడుమోలు, మొవ్వ-1, కోసూరు సచివాలయాలలో ఒక్కొక్కటి పూర్తిగా తొలగించారు. ఈ నేపథ్యంలో ఆయా సచివాలయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు ప్రభుత్వం పంపించిన సమాచార ఉత్తర్వులను ఆయా లబ్ధిదారులకు అందజేస్తున్నారు.

ఘనంగా ప్రతిష్ఠా మహోత్సవం

ప్రజాశక్తి-కోడూరు : మండల పరిధిలోని పాలకాయతిప్ప గ్రామంలో శ్రీ కోదండ రామస్వామి పరివార దేవత ప్రతిష్ట మహోత్సవం ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ ప్రతిష్ట మహోత్సవానికి ముఖ్య అతిథులుగా అగ్రి కుల క్షత్రియ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, అవనిగడ్డ నియోజకవర్గం శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ తనయుడు రాజబాబు విచ్చేసి ప్రత్యేక పూజలు చేసి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ ఆలయానికి ధ్వజస్తంభాన్ని మచిలీపట్నానికి చెందిన ప్రముఖ మెడికల్ వ్యాపారి చలమలశెట్టి సత్యనారాయణ, రాముల వారి విగ్రహాలను కోడూరుకు చెందిన అన్నం మురళి, దేవాలయంలో గ్రానైట్ రాళ్లను తెలుగు వన్ ఫౌండేషన్ అధినేత కంఠమనేని రవిశంకర్ అందించారు. ప్రతిష్ట మహెూత్సవం అనంతరం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, అంగ్రాజ్ శ్రీనివాసరావు, జరుగు పోతురాజు పూతబోయిన సీతారత్న సాయిబాబు, చినబాబు, కాగిత రామారావు, శివాజీ, ఆలయ కమిటీ సభ్యులు చిలకలపూడి అర్జునరావు, చిలకలపూడి వెంకటేశ్వరరావు, కొక్కిలిగడ్డ తానేష్ పాల్గొన్నారు.

రొమ్ము కేన్సర్‌పై అవగాహనకు
రేపు డోకిపర్రులో 'పింక్ పవర్ రన్'

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఊరికి ఉపకారం చేయాలన్నా... సమాజ హితానికి దోహదపడాలన్నా వారికే సొంతం. తెలుగు రాష్ట్రాల్లో రొమ్ము కేన్సర్‌పై అవగాహనను పెంచేందుకు వారు మార్గదర్శకులు అవుతున్నారు. వారే గుడ్లవల్లేరు మండలం డోకిపర్రుకు చెందిన మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్), సుధారెడ్డి పౌండేషన్ సంయుక్తంగా ఆ సంస్థ అధినేతలు పురిటిపాటి కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు. అభివృద్ధితో పాటు ప్రజల్లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పెంపొంది ంచటంలో భాగంగా మంగళవారం 'పింక్ పవర్ రన్' అనే కార్యక్రమాన్ని డోకిపర్రులో ప్రముఖులతో చేపట్టడమే కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల సమాజ హితులని చెప్పేందుకు నిదర్శనం. గతంలో హైదరాబాదు గచ్చిబౌలి స్టేడియంలో ఈ 'పింక్ పవర్ రన్ జరిగింది. ఈ కార్యక్రమం గిన్నిస్ వరల్డ్ రికార్డు కోసం ప్రయత్నించారు.

సమాజ హితులు వీరు...

డోకిపర్రును అభివృద్ధి చేయాలంటే వారికే సాధ్యమవుతుందని నిరూపించున్నారు. కార్పోరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ(సీఎస్ఆర్) కింద ఈ సంస్థ తమ స్వగ్రామం డోకిపర్రును దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తూ వస్తుంది. కృష్ణారెడ్డి, సుధారెడ్డి కుటుంబీకుల చేతుల మీదుగా గ్రామంలో రోడ్లు వేయటం, మంచినీటిని అందించి గ్రామాన్ని అభివద్ధి చేశారు. కొత్తగా గ్రామంలో తమ సొంత నిధులతో గ్రామ పంచాయితి భవనాన్ని కూడా నిర్మించారు. ఇంటింటికీ సురక్షిత మంచినీటి ట్యాప్‌లను ఏర్పాటు చేసి గ్రామంలో 6 వేల మంది జనాభాకు రూ.4 కోట్ల సొంత నిధులతో మంచినీటి పథకాన్ని నిర్వహిస్తున్నారు. గ్రామంలోని 1,500 గృహాలకు గ్యాస్ ఇచ్చేందుకు 20 కిలోమీటర్ల మేరకు పైపులైన్ల నిర్మాణం చేశారు. ఒక్క వంట గ్యాస్ బండకు అయ్యే ఖర్చులో 40 శాతం ఖర్చు వినియోగదారునికి ఆదా అయ్యే విధంగా ఈ గ్యాస్‌ను పంపిణీ చేస్తున్నారు. ఈ విధానం ఉమ్మడి కష్ణాజిల్లాకు కూడా అమలు చేశారు.

రేపు డోకిపర్రుకు రానున్న మిస్‌వరల్డ్

మండలంలోని డోకిపర్రుకు మిస్ వరల్డ్ ఓపెల్ సుచాత చౌంగ్‌శ్రీ, మిస్ ఆసియా కృష్ణ గ్రవిడెస్, మిస్ వరల్డ్ గ్లోబల్ అంబసిడర్ సుధారెడ్డి రానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రొమ్ము క్యాన్సర్ గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ... మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు 'పింక్ పవర్ రన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అందరి సహకారంతో గ్రామాభివృద్ధి
పురిటిపాటి కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు
(మెయిల్, సుధారెడ్డి పౌండేషన్ అధినేతలు)

అందరి సహకారంతోనే గ్రామాభివృద్ధి సాధిస్తున్నాం. అభివృద్ధి కొరకు గ్రామస్తుల అందరి అభిప్రా యాలను స్వీకరించాం.అభివృద్ధి విషయంలో కుల, మత, రాజకీయాల కతీతంగా ముందుకు సాగుతున్నాం. మహిళల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకునే ఇంటింటికీ గ్యాస్, కుళాయిలను అందించాం. గ్రామంలో అందరూ పరిపూర్ణ ఆరోగ్యంతో క్షేమంగా ఉండేందుకు మా తరపున ఎలాంటి సహాయం చేసేందుకైనా సిద్ధంగా ఉన్నాం. అందులో భాగంగానే బుధవారం పింక్ పవర్ రన్‌ను నిర్వహిస్తున్నాం.

వేడుకల నిర్వహణపై అభినందనలు

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ నియోజకవర్గ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగినట్లు సంఘ పెద్దలు తెలిపారు. ఆదివారం స్థానిక ఏలూరు రోడ్డులోని శ్రీకృష్ణ మందిరం ప్రాంగణంలో యాదవ సంఘం అధ్యక్షుడు డొక్కు రాంబాబు, సంఘ పెద్దలు ఆర్.వి.ఎల్ నరసింహారావు, వేడుకల కమిటీ సభ్యులు మాట్లాడుతూ కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా ఊరేగింపు వేలాదిమందితో ఎంతో ఘనంగా జరిగిందన్నారు. ఊరేగింపులో పాల్గొన్న యాదవ సంఘీయులు, భక్తులకు మాజీ మంత్రి కటారి ఈశ్వర్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం ఉత్సవ కమిటీ సభ్యులు లోయ రాజేష్, మేరుగుమాల సతీష్, గోరిపర్తి మురళి, కొలుసు సతీష్, దిమ్మిటి హర్ష, కొలుసు శ్రీను.పెద్దిబోయిన వెంకటేశ్వరరావు,జోగా కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

'రంగ్ తరంగ్'కు విశేష స్పందన

- చిత్ర కళా పోటీల్లో అబ్బురపర్చిన చిన్నారులు

ప్రజాశక్తి-విజయవాడ

79వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫోరం ఫర్ ఆర్టిస్ట్ అండ్ బాలోత్సవం ఆదివారం రంగ్ తరంగ్ పేరుతో చిత్రకళా పోటీలకు విశేష స్పందన లభించింది. మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ పోటీలలో మూడవ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులు 'జాతీయ చిహ్నాలు', 6, 7 తరగతుల వారికీ "భారత దేశ స్మారక చిహ్నాలు', 8, 9, 10 తరగతుల వారికీ " భిన్నత్వంలో ఏకత్వం' అనే అంశాలపై చిత్రాలు వేశారు. చిత్రకళా పోటీల అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో మాగులూరి త్రినాధాచారి శిష్య బృందంతో జానపద నృత్యాలు ప్రదర్శించబడ్డాయి. తదనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో గౌరవ అతిధిలుగా పాల్గొన్న అమరావతి బుద్ధ విహార్ ప్రధాన కార్యదర్శి శుభకర్ మేడసాని మాట్లాడుతూ అద్భుతమైన చిత్రాలు వేసిన పిల్లలను ప్రశంసించారు. చిత్రకళ వల్ల సృజనాత్మకత పెంపొందుతుందని, ఈ కలను కొనసాగించాలని చెప్పారు. రోటరీ క్లబ్ మిడ్ టౌన్ సెక్రటరీ నాగ వసంత కుమార్ మాట్లాడుతూ పిల్లలను ప్రోత్సహిస్తున్న ఫోరమ్ ఫర్ ఆర్టిస్టులను అమరావతి బాలోత్సవం నిర్వాహకులను కొనియాడారు. కొల్లూరి వెంకట సునీల్ చంద్, ప్రిన్సిపాల్ మోడరన్ జూనియర్ కాలేజీ తదితరులు పాల్గొన్నారు. చిత్రకళ పోటీల్లో గెలుపొందిన పిల్లలకు బహుమతులు అందజేశారు. ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ నాయకులు అనుమకొండ సునీల్ కుమార్, అరసవిల్లి గిరిధర్, శ్రావణ్ కుమార్, అమరావతి బాలోత్సవం నాయకులు యు.వి రామరాజు, ప్రముఖ కవి అనిల్ డ్యానీ పాల్గొన్నారు.

నేటి నుంచి తెలుగు కార్యశాల

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

మైసూరుకు చెందిన సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ (భారతీయ భాషల సంస్థ), నేషనల్ టెస్టింగ్ సర్వీస్-ఇండియా (జాతీయ పరీక్ష సేవాకేంద్రం), విజయవాడ పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగుశాఖ సంయుక్త నిర్వహణలో తెలుగులో పరీక్ష మూల్యాంకనం, ప్రశ్నాంశ రచనపై ఆరు రోజుల శిక్షణశిబిరం ఈ 18న ఉదయం 10 గంటలకు పి.బి.సిద్ధార్థ కాలేజి వెబినార్ హాలులో ప్రారంభమవుతుంది. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తెలిపారు. ఈ ప్రారంభ సభలో కార్యక్రమ ఉద్దేశాన్ని సిఐఐఎల్ రిసోర్స్ పర్సన్ డాక్టర్ ఎం.నారాయణరెడ్డి వివరిస్తారు. కళాశాల కన్వీనర్, సిద్ధార్థ అకాడమీ జాయింట్ సెక్రెటరీ నిమ్మగడ్డ లలితప్రసాద్ ప్రారంభోపన్యాసం చేస్తారు. సహాయాచార్యులు డాక్టర్ ఎన్.శివకుమార్ కీలక ఉపన్యాసం చేస్తారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయనకేంద్రం సీనియర్ ఫెలో డాక్టర్ కె.రవిబాబు పాల్గొంటారు. డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ కె.బాలకష్ణ తెలుగు ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు పాఠాలు బోధిస్తారు. ఈ నెల 20 వరకు ముఖాముఖి విధానంలో ప్రత్యక్షంగా జరిగే ఈ కార్యక్రమం ఈ నెల 21 నుంచి 23 వరకు ఆన్ లైన్ విధానంలో కొనసాగుతుంది.

మనవ్ కలంకారీ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

హైదరాబాద్, మచిలీపట్నంలో మనవ్ కలంకారీ షోరూమ్‌ను ఆదరించినట్లే విజయవాడలో కూడా ఆదరించాలని చైర్మన్ నవీన్ కోరారు. తమ షో రూమ్‌లో కలంకారి చీరలు, టాప్‌లు, లెగ్గిన్స్, స్టైచబుల్ బ్లౌజులు, బెడ్ షీట్స్, చందేరి, కోట, ఉప్పాడ, జార్జెట్ చీరలు వివిధ రకాల కలంకారి వస్త్రలు లభిస్తాయని చెప్పారు. ప్యూర్ ఆర్గానిక్ కలర్స్‌తో ప్రింటింగ్ చేసిన కలంకారీ డిజైన్లతో అందించడం తమ ప్రత్యేకత అని వెల్లడించారు. విజయవాడ పుష్ప హోటల్ సెంటర్‌లో నూతనంగా మనవ్ కలంకారీ షోరూమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ షోరూమ్‌ను సంస్థ చైర్మన్ నవీన్, మనోజ్ఞ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ నవీన్ మాట్లాడుతూ తమకు హైదరాబాద్, మచిలీపట్నంలో బ్రాంచ్‌లు ఉన్నాయని, ప్రజల నుంచి మంచి స్పందన రావడంతో. అదే ఉత్సాహంతో విజయవాడలో మూడవ బ్రాంచ్‌ను ప్రారంభించమని తెలిపారు. ఈ షోరూమ్‌లో టాప్‌లు, లెగ్గిన్స్, స్టైచబుల్ బ్లౌజులు, బెడ్ షీట్స్, చందేరి, కోట, ఉప్పాడ, జార్జెట్ చీరలు వివిధ రకాల వస్త్రలు , షర్ట్స్, స్టోల్స్ , చున్నీస్,దివాన్ సెట్స్ లభిస్తాయని చెప్పారు. ఇవన్నీ నూరు శాతం ఆర్గానిక్ కలర్స్‌తో తయారవుతున్నాయని, బ్లాక్ ప్రింటింగ్ విధానంతో తయారు చేసినవేనని చెప్పారు. "23 పద్ధతుల్లో కలంకారి వస్త్రాలు తయారు అవుతాయని ,ఒక వస్త్రం పూర్తి అవడానికి 43 రోజుల వ్యవధి పడుతుందని వెల్లడించారు. కలంకారి శైలిని ప్రపంచ వ్యాప్తంగా అందించే లక్ష్యంతో మనవ్ కలంకారి అవుట్లెట్లు ప్రారంభించామని ప్రపంచంలోనే తోలి అవుట్ లెట్ ను తామే ప్రారంభించామని చెప్పారు. ఈ షోరూమ్ విజయవంతం కావాలని, ప్రజల మద్దతు అందించాలని నవీన్ ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్స్ శ్యాం లాల్, శాంతి శ్రీ పాల్గొని మనవ్ కలంకారి షోరూమ్ ను ప్రారంభించారు.

ప్రమాదాలను అరికట్టండి..

- సిఐటియు విజయవాడ సిటీ అధ్యక్షులు దుర్గారావు

ప్రజాశక్తి-విజయవాడ

ప్రమాదాలను అరికట్టి ప్రాణాలను కాపాడాలని సిఐటియు విజయవాడ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు రాష్ట్ర ప్రభుతాన్ని కోరారు. రోడ్డు ప్రమాదాలు నివారించాలని కోరుతూ ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మోటార్ వాహనాలకు ఉండే హెడ్ లైట్లకు ఎల్ఈడి బల్బులు తెల్లని కాంతితో ఫోకస్ రావడంతో రాత్రి సమయాలలో కళ్ళు బైర్లు కమ్మి ఎదురుగా వస్తున్న వాహనాలకు ఏ వాహనం వస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని, దీనితోపాటు దారి కనపడకపోవడం వలన ప్రమాదాలు జరుగుతూ కొంతమంది అంగవైకల్యంకావడం కొన్ని సందర్భాలలో ప్రాణాలు కూడా పోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. గతంలో హెడ్ లైట్ల కు ఎదురు బ్లాక్ స్టిక్కర్ ఏర్పాటు చేసేవారు దీనివలన కళ్ళకు కాంతి కొట్టకుండా ఆ బ్లాక్ స్టిక్కర్లు కాపాడేవి నేడు ఏ ఒక్క వాహనానికి అటువంటి స్టిక్కర్లు లేకపోవడంతో రాత్రి సమయాలలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.కావున ట్రాన్స్‌పోర్ట్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు వాహనదారులను చైతన్యపరిచి ప్రమాదాలను నివారించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు.

ఉరుసు మహోత్సవంలో వెలంపల్లి

విజయవాడ సిటీ : స్థానిక భవానీపురం, స్వాతి థియేటర్ హజరత్ సయ్యద్ షా అమినుద్దీన్ చిష్టి ఉర్సు మహోత్సవాల్లో మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ వైసిపి ఇన్‌ఛార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆదివారం స్థానిక మత పెద్దలతో కలిసి చాందర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఎఐఎస్‌జిఇఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడిగా విద్యాసాగర్ ఎన్నిక

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

న్యూఢిల్లీలో జరుగుతున్న అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఎఐఎస్‌జిఇఎఫ్) జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర అధ్యక్షుడుని జాతీయ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆగస్టు 16, 17, 18 తేదీల్లో న్యూఢిల్లీ ఫరీదాబాద్‌లో జరుగుతున్న అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య కార్యవర్గ సమావేశంలో 29 రాష్ట్రాల నుంచి రాష్ట్ర సంఘం నాయకులు పాల్గొన్నారు. ఎఐఎస్‌జిఇఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుకుమార్ ఎన్నికను ప్రతిపాదిస్తూ అలపర్తి విద్యాసాగర్ పేరును జాతీయ ఉపాధ్యక్షుడిగా సూచించారు. జాతీయ కార్యవర్గ సభ్యులందరూ, రాష్ట్రాల ప్రతినిధులు ఎన్నికను ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. తదుపరి ఎన్నికను ఏకగ్రీవంగా జరిగినట్లు ప్రకటించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డివి రమణ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ జాతీయ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ తన బాధ్యతలో మరింత పెరిగాయని, జాతీయ స్థాయిలో జరిగే ఉద్యమాల కార్యాచరణ బాధ్యత కూడా తన మీద ఉంటుందని, ముఖ్యంగా జాతీయస్థాయిలో జరిగే సిపిఎస్ రద్దు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, లేబర్ కోడ్ వంటి అంశాలపై ఉద్యమించాల్సిన అవసరం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని, ఎన్నికలు నడిపించిన చైర్మన్ సుభాష్ లాంబ, ప్రధాన కార్యదర్శి శ్రీ సుకుమార్ కు జాతీయ కార్యవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన విద్యాసాగర్‌ను సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డివి రమణ, ఆల్ ఇండియా వుమెన్ సబ్ కమిటీ కన్వీనర్ రాజ్యలక్ష్మి,, నాయకులు రవిశంకర్, కిషోర్, మాజీ నాయకులు మహమ్మద్ ఇక్బాల్ అభినందనలు తెలిపి సత్కరించారు.

5,465 కుటుంబాలకు చేయూత

ప్రజాశక్తి-విజయవాడ

పాడి రైతుల సంక్షేమంతో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ పి4లో మేము సైతం అంటూ 5,465 గ్రామీణ బంగారు కుటుంబాలకు మార్గదర్శనం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చింది. ఈ మేరకు కృష్ణా మిల్క్ యూనియన్ అధ్యక్షులు చలసాని ఆంజనేయులు, పాలకవర్గ సభ్యులు తాజాగా నందిగామ మండలం, మునగచర్లలో జరిగిన సామూహిక గోకులం కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ జి.లక్ష్మీశకు ప్రమాణ పత్రాలు అందజేశారు. వత్సవాయి మండలం నుంచి 1,524 బంగారు కుటుంబాలు, పెనుగంచిప్రోలు మండలం నుంచి 1,192, విస్సన్నపేట మండలం నుంచి 1,255, విజయవాడ గ్రామీణ మండలం నుంచి 747, చందర్లపాడు నుంచి 747 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు ఆంజనేయులు ప్రకటించారు. బంగారు కుటుంబాల ఆర్థికస్థితిగతులను అధ్యయనం చేసి.. వారి జీవితాలను సాధికారత దిశగా నడిపించేందుకు అవసరమైన చేయూత అందించనున్నట్లు పేర్కొన్నారు. పాడి పశువుల కొనుగోలుకు కేడీసీసీ ద్వారా ఇచ్చే రూ. లక్ష చొప్పున రుణాలకు సంబంధించి వడ్డీని యూనియన్ భరిస్తుందన్నారు. మహిళా పాడి రైతులను కూడా పెద్దఎత్తున ప్రోత్సహిస్తామని.. పాడితో కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా జిల్లా అధికార యంత్రాంగంతో కలిసి అడుగులువేస్తామన్నారు. బంగారు కుటుంబాలకు చెందిన సభ్యులకు అవసరం మేరకు ఆరోగ్య సేవలు కూడా అందిస్తామని వివరించారు. మేలు జాతి పశు సంతతి, పాల ఉత్పత్తి వద్ధికి వీలుగా పెయ్యి దూడలు పుట్టేలా లక్ష డోసుల లింగ నిర్ధారిత వీర్యాన్ని అందించేందుకు రూ.కోటి సహాయాన్ని కూడా కష్ణా మిల్క్ యూనియన్ ప్రకటించింది. రూ.150 విలువైన ఒక్కో డోసుకు రూ. 100 రాయితీ ఇవ్వనున్నట్లు వివరించింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రాన్ని మార్చే సత్తా పాడి పరిశ్రమకు ఉందని.. ఈ నేపథ్యంలో పాడితో పేదరికాన్ని తరిమికొట్టాలనే సంకల్పంతో వేల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చిన కృష్ణా మిల్క్ యూనియన్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.